ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
ఆదివారం 3 నవంబరు 2024 | 5





వర 'ప్రసాదం'

భక్తునికి, భగవంతునికి అనుసంధానమైంది అగరుబత్తి అన్నట్టుగానే.. దేవుడికి, భక్తుడికి అనుసంధానమైంది మరొకటి ఉంది. అదే ప్రసాదం. దేవుడికి పెడితే నైవేద్యం. తర్వాత అది భక్తుడికి చేరితే ప్రసాదం. ఈ ప్రసాదం విశేషాలు..

- 6లో



మద్యం.. మీనమేషాలు!

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

మద్యం వ్యాపారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. గతనెల 16వ తేదీ నుంచి మద్యం అమ్మకాలకు అనుమతి వచ్చినప్పటికీ చాలామంది కుదుటపడలేదు. జిల్లాలో 125 దుకాణాలకు టెండర్లు పిలిచి లాటరీవేసి, కేటాయించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం రెండు నెలలకు మొత్తం 125 దుకాణాల నుంచి డిపాజిట్ రూపంలో రూ.14.35 కోట్ల ఆదాయం వచ్చింది. దరఖాస్తు రూపేణా 87.68 కోట్ల ఆదాయం వచ్చిన సంగతి తెలిసిందే. ఇక గతనెల 16వ తేదీ నుంచి ఇప్పటివరకూ రాజమహేంద్రవరం మద్యం డిపో నుంచి రూ.72 కోట్ల 29 లక్షల విలువైన సరుకు దుకాణాలకు చేరింది. సుమారు రోజుకు జిల్లాలో రూ.3 కోట్ల సరుకు తాగేసినట్టు లెక్క. ప్రభుత్వం రూ.99కే క్వార్టర్ ఇస్తున్న సంగతి తెలిసిందే. దీనికి డిమాండ్ బాగా పెరిగింది. సరుకు మాత్రం కొంతే రావడం గమనార్హం. అన్నీ దుకాణాల నుంచి ఇండెంట్లు పెట్టినా, డిపో నుంచి సరుకు ఇవ్వలేకపోతున్నారు. ఇక పోటాపోటీగా దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు సిండికేట్ కావడానికి చేసిన ప్రయత్నాలు ఇంకా పూర్తిగా కొలిక్కిరాలేదు. వాస్తవానికి చాలామంది దుకాణాలు నిర్మించుకునే పనిలో ఉన్నారు. తాత్కాలికంగా షాపులు నిర్వహిస్తున్నారు. కొందరు పెద్దరూమ్‌లు పెట్టుకోవడంతో, కొందరు వ్యాపారులకు నష్టం జరుగుతోంది. కొందరు బెల్ట్‌షాపులు పెట్టే ప్రయత్నంలో ఉన్నారు.



కార్తీక సందడి మొదలైంది..



రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌లో శనివారం తెల్లవారుజామున కార్తీక స్నానాలు ఆచరించి పూజలు చేస్తున్న మహిళలు

కార్తీక సందడి మొదలైంది. రాజమహేంద్రవరం, కొవ్వూరులలోని గోదావరి ఘాట్లలో వేలాది మంది పుణ్యస్నానాలు చేసి పూజలు చేశారు. శనివారం వేకువజామునే భక్తుల రద్దీ కనిపించింది. తర్వాత నదిలోకి దీపాలు వదిలారు. శైవ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



అంతా తామై..

- ఇంటి మేనేజర్లు.. బాధ్యతల ఇంజనీర్లు
- వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలు
- వృత్తి.. కుటుంబం.. రెండు కళ్లుగా పయనం
- నేడు ప్రపంచ గృహిణుల దినోత్సవం

చదువులో ఎంత రాణించినా.. ఏ హోదాకు ఎదిగినా.. ఉన్నత స్థానాన్ని అందుకొన్నా.. ఒక మహిళకు గృహిణిగా ఉన్న బాధ్యత ముందు అవన్నీ చిన్నవే. భర్త అవసరాలను తీర్చి.. పిల్లల అలనాపాలనా చూస్తూ.. పెద్దలను సముదాయిస్తూ.. ఇంటిని చక్కబెట్టుకుంటూ.. ముందుకు సాగాలి. ఇంట్లో వాళ్లకు ఏ సమయానికి ఏమి కావాలో చూసుకోవడమే ప్రధాన విధిగా రోజులు గడుపుతుంది. ఆమె చేసే ఇంటి పనులను ఆర్థికంగా లెక్కగడితే పురుషుల సంపాదన దిగదుడుపే. అందుకే ఇంటికి వెలుగు ఇల్లాలు అనే నానుడి అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ బాధ్యతల బరువును మోస్తూనే ఉంటుంది. ఇక వివిధ పదవుల్లో, ఉద్యోగాల్లో ఉన్న గృహిణులైతే అటు ఆ బాధ్యతలు ఇటు ఇల్లు చక్కబెట్టుకోవడంతోనే జీవితం సాగిపోతుంది. ఈ క్రమంలో తమ సంతోషాలనూ త్యాగం చేస్తారు. ప్రపంచ గృహిణుల దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.



తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి



కుటుంబ సభ్యులతో దీపావళి వేడుకలు చేసుకుంటున్న జిల్లా కలెక్టర్

చిన్న చిన్న సంతోషాలకు దూరమవుతాం..

2007లో పార్వతీపురం ఆర్డీవోగా విధుల్లో చేరాను. 2008లో పెళ్లయింది. ప్రస్తుతం పాప సెవన్త్, బాబు పదో తరగతి. మాకు పరిచయం అయిన తర్వాత పెద్దల అంగీకారంతో వివాహం జరిగింది. అప్పటి నుంచీ గృహిణిగా బాధ్యతలు వచ్చాయి. నాన్న, అమ్మ, అత్తమ్మ ముగ్గురూ మాతోనే ఉంటారు. మామయ్య లేరు. గృహిణిగా నా బాధ్యతల్లో కొన్ని వాళ్లు తీసుకున్నారు. పిల్లల బాధ్యత పూర్తిగా నేను తీసుకుంటాను. ఆఫీస్ పని అయిపోయాక వాళ్లతో గడపడానికి ప్రయత్నిస్తాను. నేను ఇంటికి వెళ్లేప్పటికి రాత్రి 9గంటలు అవుతుంది. చిన్నప్పుడు నా సమయం సర్దుబాటు చేసుకొని వాళ్లకు నేనే వండి పెట్టడం జరిగేది. లంచ్ సమయంలో కాస్త సమయం కుదిరేది కాదు. రాత్రి నేను వెళ్లే వరకూ ఇద్దరు పిల్లలూ వేచి చూస్తుంటారు. ఆలస్యం అయినా అలాగే ఉంటారు. నాకు బాగా ఆలస్యమైతే అన్నం తినేసినా నాకోసం అర్ధరాత్రి వరకూ ఎదురుచూస్తూనే ఉంటారు. మా హస్బండ్ ఢిల్లీరావు డైరెక్టర్ ఆఫ్ ఏపీ అగ్రికల్చర్. విజయవాడలో ఇప్పుడు బాబు ఆయన దగ్గర ఉంటున్నారు. పాప నా దగ్గర ఉంటోంది. ఏదేమైనా పిల్లలతో గడపాల్సిన చాలా సమయం మిస్ అవుతున్నాం. చిన్న చిన్న సంతోషాలను అందించలేకపోతున్నాం. సాయంత్రం స్కూల్ నుంచి వచ్చినప్పుడు ఎదురెళ్లి దగ్గ రకు తీసుకోలేకపోతున్నాం. వాళ్లు ఆ సమయంలో ఏమైనా మాకు చెప్పాలని ఆతృతతో వచ్చినా మేం ఇంటికెళ్లే వరకూ ఎదురుచూడక తప్పదు. పుట్టినరోజులు మిస్ అవుతాం. మొన్న సెప్టెంబరు 1న బాబు పుట్టినరోజు. ఇక్కడ ఉధృతంగా వరదల వల్ల బిజీగా ఉన్నాను. నాకు సమయం లేకపోవడంతో నా ఆశీర్వాదం కోసం విజయవాడ నుంచి బాబు వచ్చాడు. ఇలాంటివి పిల్లల మనసునూ కాస్త బాధ పెడతాయి. బాధ్యతలు తీసుకోనేప్పుడే ఉద్యోగ బాధ్యతలు ఏమిటి, ఎంత సమయం ఉంటుంది? వ్యక్తిగత జీవితం ఎలా ఉంటుందీ తెలుసు. అందువల్ల వ్యక్తిగత జీవితాన్ని సర్దుబాటు చేసుకోవాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలకు అందరూ వస్తారు. నువ్వు రావడంలేదని మా పాప ప్రశ్నిస్తూనే ఉంటుంది. ఏదో సర్దిబుచ్చుతాం. మేం చాలావరకూ వెళ్లలేం. టీచర్లతో ఫోన్లోనే మాట్లాడే పరిస్థితి ఉంటుంది. పిల్లలే కాకుండా కుటుంబపరంగా జరిగే వేడుకలు తదితర కార్యక్రమాలకు కూడా హాజరుకాలేం. సమయం దొరికినప్పుడు నేనే వండి పెడతాను. నేను ఇంట్లో ఉండే వండి పెట్టాలని పాప డిమాండ్ చేస్తుంది కూడా. పిల్లల విషయంలో చిన్న చిన్న సున్నితమైన అను భవాలు కోల్పోతూ ఉంటాం. ఇంట్లోనే ఉంటున్నాం.. ఏమీ చేయలేకపోతున్నాం.. అని కొందరు గృహిణులు బాధపడుతూ ఉంటారు. కానీ వాళ్ల కంట్రిబ్యూషన్ వాళ్లకు తెలియడం లేదు. ఎంత చదువుకున్నా.. ఎన్ని సర్టిఫికెట్లు ఉన్నా.. ప్రధానంగా విలువలు అనేవి ఇంట్లో నుంచే అలవడతాయి. ఓ ఇంజనీరును, డాక్టరును, కలెక్టర్‌ని తయారుచెయ్యగలం కానీ నైతిక విలువలు, బాధ్యతలు అనేవి కుటుంబ వ్యవస్థ నుంచే, అదీ అమ్మ నుంచే 90 శాతం వస్తాయి. ఎవరైతే పిల్లలతో ఎక్కువ సమయం గడుపుతారో పిల్లలకు విలువలు అందించడంలో విజయం సాధిస్తారు. చట్టంకంటే ఇంట్లోనే మంచి చెడులను చెప్పగలిగితే చాలావరకూ సమస్యలు ఉండవు. అందువల్ల పిల్లల క్యారెక్టర్ బిల్డింగ్‌లో గృహిణులు పూర్తి న్యాయం చేయగలుగుతారు. ఒకటి జిల్లా, రెండు సొంత కుటుంబం. రెండు కుటుంబాలనూ బ్యాలెన్స్ చేసుకోవాల్సిన బాధ్యత కూడా మాపైనే ఉంటుంది. గృహిణులకు ప్రపంచ గృహిణుల దినోత్సవ శుభాకాంక్షలు. - ఆంధ్రజ్యోతి/రాజమహేంద్రవరం



అంగన్‌వాడీలో టీచర్‌గా.. ఎమ్మెల్యేగా శిరీషదేవి

గృహిణి నుంచి అంగన్వాడీ టీచర్.. ఇప్పుడు అసెంబ్లీలో..

ఆమె ఓ సాధారణ గృహిణి.. అంగన్వాడీ టీచర్.. రెండింటి మధ్యా సమన్వయం చేసుకుంటూ సాగే జీవితం. ఇప్పుడు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి. రాజవొమ్మంగి మండలం గింజర్తి శిరీషదేవి సొంతూరు. సాధారణ గిరిజన కుటుంబం. శిరీషదేవి మూడో ఏటనే ఆమె తండ్రి మరణం. కుటుంబ బాధ్యతలు ఆమె తల్లివే. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు శిరీషదేవి చదువు తన సొంతూరులోనే. ఆరు నుంచి పదో తరగతి వరకు సింగంపల్లి. ఇంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల రాజవొమ్మంగి. డిగ్రీ (బి.ఏ) సెయింట్ పాల్ కళాశాల రాజమహేంద్రవరం. బీఈడీ ఆదిత్య కళాశాల కాకినాడ. ఆ సమయంలోనే శిరీషదేవికి 2015లో మఠం భాస్కర్‌తో వివాహం. వీరిది ప్రేమవివాహం. అత్తగారిది అనంతగిరి. శిరీషదేవి గృహిణిగా జీవితం మొదలైంది. తర్వాత అనంతగిరి అంగన్వాడీ టీచరు చిరుద్యోగం పొందారు. చిన్నారులను లాలించడం, ఆడించడం విద్యాబుద్ధులు నేర్పించడంలో శిరీషదేవి బిజీ అయ్యారు. కాలం గిరా గిరా తిరిగింది. ఎవరి జీవితం ఎపుడు మలుపు తిరుగుతుందో తెలియదు కదా. రాష్ట్రమంతా ఎన్నికల వేడి. నారా లోకేశ్ యువగళంలో నిమగ్నమయ్యారు. తన భర్త టీడీపీ నేత కావడంతో ఇద్దరూ కలసి లోకేశ్‌ని కలిశారు. రాజకీయాలపై ఉన్న ఆసక్తిని శిరీషదేవి వ్యక్తపర్చింది. ఎందుకమ్మా అని లోకేశ్ అడగడం, అంగన్వాడీల సమస్యల పరిష్కారానికని శిరీషదేవి చెప్పడం.. అది విన్న లోకేశ్ ఓ నవ్వు నవ్వి ఊరుకోవడం. సీన్ కట్ చేస్తే.. శిరీషదేవికే పార్టీ టికెట్.. ఎన్నికల ప్రచారం, హామీలు.. అఖండ విజయం.. ఇప్పుడు శిరీషదేవి ఎమ్మెల్యే. మొన్నటికి మొన్న అసెంబ్లీ సమావేశ సమయంలో తన నియోజకవర్గపు సమస్యలు, విలీన మండలాల కష్టాలు, జీవో మూడు ఆవశ్యకతపై గళమెత్తిన తీరు శిరీషదేవికి ప్రత్యేకతను చాటాయి. ఎమ్మెల్యేగా తన తొలి వేతనంతో ప్రాథమిక ఆసుపత్రులకు ఇన్వర్టర్లు కొనివ్వడం, తనకున్న బొలేరు వాహనాన్ని అంబులెన్సుగా మలచి నియోజకవర్గ ప్రజలకు అంకితం చేయడం పేదలపై ఆమెకున్న మక్కువను స్పష్టం చేశాయి. ఏదేమైనప్పటికీ ఒక సాధారణ గృహిణిగా జీవితం మొదలు పెట్టి ఒక అంగన్వాడీగా జీవితం కొనసాగించిన మిరియాల శిరీషదేవి ఎమ్మెల్యేగా గెలిచి ఏజెన్సీ సమస్యలను పరిష్కరించడమే ప్రథమ కర్తవ్యమని ఆమె గట్టిగా చెబుతున్నారు.

- ఆంధ్రజ్యోతి/చింతూరు

గృహిణి నుంచి.. ఎమ్మెల్యేగా..

ఇంటి బాధ్యతలు ఆమె దినచర్య.. రాజకీయ నాయకుడైన తన భర్త యోగక్షేమాలు, పిల్లలను చదివించుకోవడం ఆమె విధి. వంటావార్పూ సరేసరి. ఆమె కుటుంబంలో ఊహించని షాక్. భర్త గుండెపోటుతో ఆకస్మిక మృతి. ఆ షాక్ నుంచి కోలుకుని తన భర్త ఆశయ సాధనకోసం గృహిణి స్థానం నుంచి నెలల వ్యవధిలో ఎమ్మెల్యే స్థానానికి ఎదిగారు ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా. ఏడాదిన్నర కిందట వరకు వరుపుల సత్యప్రభ ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల రాజాకు సతీమణి మాత్రమే. రాజకీయాలతో పనిలేదు. 2019లో టీడీపీ అభ్యర్థిగా వరుపుల రాజా పోటీచేసి ఓడిపోయారు. 2023 మార్చి 4న రాజా గుండెపోటుతో ఆకస్మికంగా మృతితో అప్పటివరకు నుంచి ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి బాధ్యతలు సత్యప్రభపైనే టీడీపీ అధిష్ఠానం బాధ్యతలు అప్పగించింది. అప్పటినుంచి విపరీతంగా శ్రమించి పార్టీ బాధ్యతలు ముందుకు నడిపించారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ప్రత్తిపాడు ఎమ్మెల్యే అయ్యారు. తన భర్త రాజా నియోజకవర్గానికి ఏం చేయాలో ఏవిధమైన అభివృద్ధి చేపట్టాలో కన్న కలలను ఆమె సాకారం చేసేందుకు వడివడిగా అడుగులు వేస్తున్నారు. కష్టాలు వచ్చినప్పుడు కుంగిపోవద్దని, ఎదురొడ్డి నిలబడి విజయాన్ని అందుకోవాలని ఆమె సూచించారు.

- ఆంధ్రజ్యోతి/ప్రత్తిపాడు



సీహెచ్ వసంతకుమారి
మహిళా సెంట్రల్ జైలు పర్యవేక్షణాధికారి



త్యాగం తప్పదు..

పెళ్లయిన పదేళ్లకే మావారు కాలం చేశారు. మాకు ఇద్దరు అమ్మాయిలు. గృహిణిని. పెళ్లయిన తర్వాత నా భర్త నేను చదువుకోడానికి చాలా ప్రోత్సాహం ఇచ్చారు. నన్ను గ్రూప్-1 అధికారిగా చూడాలని కోరిక. కానీ తీరలేదు. కానీ 2007లో మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించాను. డిప్యూటీ జైలర్ (ఎస్ఐ క్యాడర్)గా రాజమండ్రిలో విధుల్లో చేరాను. తర్వాత కడప, వరంగల్‌లో పనిచేసి రాజమండ్రి మహిళా ప్రత్యేక కారాగారం సూరింటెండెంట్‌గా వచ్చాను. కొన్ని కావాలంటే మరికొన్ని త్యాగం చేయాల్సి ఉంటుంది. నేనూ అదే చేశాను. పిల్లలకు మంచి జీవితం అందించాలనేదే ఆశయం. ఉద్యోగ బాధ్యతలకు ఇబ్బంది కలగకుండా.. పిల్లలకు వండి పెట్టుకోడానికి సమయాన్ని సర్దుబాటు చేసుకోవడం అలవాటైంది.

- ఆంధ్రజ్యోతి/రాజమహేంద్రవరం



ఇసుక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ఉచిత ఇసుకకు జీఎస్టీ రద్దు

- స్టాక్ యార్డ్ వద్ద టన్ను ఇసుక రూ.150కి తగ్గింపు
- డీసిల్టేషన్ ర్యాంపుల వద్ద రూ.229కి తగ్గింపు
- ఓపెన్ రీచ్‌ల వద్ద రూ.118కి తగ్గింపు
- రెండు మూడు రోజుల్లో ఓపెన్ రీచ్‌లన్నీ ప్రారంభం
- జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్

రాజమహేంద్రవరం, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానాన్ని అనుసరించి ఇసుక లభ్యతను పెంచడానికి వీలుగా గత నెల 25న జారీ చేసిన జీవో నంబరు 66 ప్రకారం ఇసుకపై జీఎస్టీ తొలగించడంతోపాటు ఇసుక తవ్వకం, లోడింగ్ చార్జీలను బాగా తగ్గించినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానికంగా శనివారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్‌సీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనుమతి పొందిన బోట్స్‌మన్ సొసైటీలన్నీ మంగళవారం నాటికి ఇసుకతీత మొదలుపెట్టాలన్నారు. వినియోగదారులకు, ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలకు, ఇతర నిర్మాణ, అభివృద్ధి పనులకు అవసరమైన ఇసుక అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టామన్నారు. రెండు మూడు రోజులలో మొత్తం ఓపెన్ రీచ్‌లన్నీ అందుబాటులోకి రావాలన్నారు. జిల్లాలో 16 ఓపెన్‌రీచ్‌లు, 9 డిసిల్టేషన్ పాయింట్లు ఉన్నాయన్నారు. స్టాక్ పాయింట్ల వద్ద మెట్రిక్ టన్ను ఇసుక ధర రూ.270 ఉండగా, ప్రభుత్వం దానిని రూ.150కి తగ్గిందని చెప్పారు. డీ సిల్టేషన్ పాయింట్ల వద్ద టన్ను ఇసుక ధర రూ.345 ఉండగా, దానిని రూ.229కి తగ్గించామని, ఓపెన్ రీచ్‌ల వద్ద రూ. రూ.220 ధరను రూ. 118కి తగ్గించినట్టు వివరించారు. ఈ సవరించిన ధరలను అన్ని ర్యాంపుల వద్ద అందరికీ తెలిసేలా ప్రదర్శించాలన్నారు. ప్రవాహాలకు ఆనుకుని ఉన్న స్థానిక సంస్థల ప్రాంతాల్లోని ప్రజల కోసం ఇసుక వివరాలను ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించాలని వివరించారు. మైన్స్ అధికారులు రూపొందించిన దరఖాస్తు, పోర్టల్ ప్రకారం ఆయా పాయింట వద్ద వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. అక్కడ ఉచిత ట్రాన్సిట్ ఫారమ్ పొందాలని, ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ అప్లికేషన్ ద్వారా నమోదు చేసుకున్న తర్వాత ఇన్‌చార్జి నుంచి డెలివరీ తేదీ, సమయం స్లాట్ తీసుకోవచ్చని వివరించారు. ఇసుకను సొంతంగా మనుషులను పెట్టి కూడా తీసుకోవచ్చని, లేదా డీఎల్ఎస్‌సీ ఎంపిక చేసిన ఏజన్సీ సహాయం తీసుకోవచ్చన్నారు. ట్రాక్టర్ల ద్వారా నేరుగా ఓపెన్ రీచ్‌ల నుంచి ఇసుక తీసుకుని వెళ్లవచ్చన్నారు. మల్లేశ్వరం ఓపెన్‌రీచ్ కోనసీమ జిల్లాలో ఉన్న దృష్ట్యా, ఉత్తరప్రత్యుత్తరాలతో పరిష్కరించుకోవాలని నిర్ణయించారు. చట్టబద్ధమైన మినహాయింపులో భాగంగా ఇసుకపై సీనరేజి, తవ్వకాలు, రవాణా, లోడింగ్, పరిపాలన వ్యయంపై జీఎస్టి పూర్తిగా మినహాయించినట్టు ఆమె వివరించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. చినరాముడు, ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, ఏడీ మైన్స్ డి.ఫణిభూషణ్‌రెడ్డి, జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్, జిల్లా భూగర్భ జలాల అధికారి వై.శ్రీనివాస్, సహాయ పర్యావరణ అధికారి ఎ.రామచంద్రమూర్తి, ఇరిగేషన్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ బివి గిరి, ఆర్అండ్‌బీ ఈఈ ఎస్‌బీవీ రెడ్డి, మైన్స్ ఏజీ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా జీఎస్టీ తదితర వివరాలలో లోపాలు ఉన్న కారణంగా ఇటీవల టెండర్ల ద్వారా వేమగిరి- కడియపు లంక, వంగలపూడి ర్యాంపుల నిర్వాహకుడికి మైన్స్ అధికారులు నోటీసులు ఇచ్చినట్టు సమాచారం. ఇక్కడ అధికారులు నిర్ణయించిన ధరకంటే తక్కువకే ఇసుక సరఫరా చేస్తానని సదరు కాంట్రాక్టరు టెండర్లు స్పష్టంగా చేయగా, అతనికి ఈ రెండు ర్యాంపులు దక్కాయి. కానీ వివరాలు నమోదు సమయంలో తప్పుడు సమాచారం ఉన్నట్టు అనుమానం రావడంతో నోటీసులు ఇచ్చినట్టు తెలిసిందే. దీంతో ఈ ర్యాంపులు ఆ వ్యక్తికే ఇవ్వాలా, రద్దు చేయాలా నిర్ణయించాలి.

కోటిలింగాలలో డ్రెడ్జింగ్

కోటిలింగాల డిసిల్టేషన్ పాయింట్లలో బోట్స్‌మన్ సొసైటీ పేరిట అనుమతి పొందిన కొందరు డ్రెడ్జింగ్ చేయడం గమనార్హం. ప్రతీరోజూ రాత్రి సమయంలో భారీగా డ్రెడ్జింగ్ చేస్తున్నారు. వైసీపీలో ఓ పదవి అనుభవించిన వ్యక్తి, ఇవాళ కొందరిని కలుపుకుని లక్షణరేఖ దాటడం గమనార్హం. ఇక్కడ అధికారులు కూడా ఎవరూ మాట్లాడకపోవడం గమనార్హం. లారీ ఇసుకను రూ.వేలాదికి విక్రయిస్తున్నారు. గాయత్రీ ర్యాంపులలో లారీ ఇసుకకు అదనంగా రూ.4 వేలు కొన్ని ర్యాంపుల నిర్వాహకులు వసూలు చేస్తుండగా, అక్కడ పర్యవేక్షకులుగా ఉన్న రెవెన్యూ ఉద్యోగులు రూ.1500 వంతున వసూలు చేస్తున్నట్టు సమాచారం.

ఆదివారం ప్రత్యేకం

వర 'ప్రసాదం'



అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో విక్రయించే రవ్వలడ్డూ ప్రసాదం

అమోఘం.. అయినవిల్లి రవ్వలడ్డూ

అయినవిల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధి వినాయక ఆలయంలో 2003 నుంచి ప్రసాదాల తయారీ ప్రారంభించారు. అత్యంత రుచికరమైన ప్రసాదంగా పేరొందింది. స్వామివారి ప్రసాదాలుగా లడ్డూ, పులిహోర విక్రయిస్తున్నారు. అర్చకస్వాములే ప్రసాదం తయారుచేస్తున్నారు. రోజుకు 50 కిలోల రవ్వ, 10 కిలోల హెరిటేజ్ నెయ్యితో రవ్వ తయారీ చేస్తున్నారు. సాధారణ రోజుల్లో 900 నుంచి వెయ్యి లడ్డూలు, పర్వదినాల్లో 3 వేల నుంచి 4 వేల వరకు విక్రయిస్తున్నారు. పులిహోర రోజుకు 40 కిలోలు, పర్వదినాల్లో 800 పులిహోర ప్యాకెట్లు, ప్యాకెట్ ఒకటి రూ.10 వంతున విక్రయిస్తున్నారు.



ఏదైనా ఆలయానికి దేవుడి దర్శనానికి వెళతాం. దర్శనం పూర్తయ్యాక కచ్చితంగా వెళ్లేది ప్రసాదం కోసమే. దేవుడి వర ప్రసాదంగా భావిస్తాం కాబట్టే అది అత్యంత పవిత్రమైందిగా కళ్లకు అద్దుకుని మరీ స్వీకరిస్తాం. ఆలయానికి వచ్చే భక్తుల కోసం ప్రముఖ ఆలయాలన్నీ ప్రసాదాన్ని ఎంతో పవిత్రంగా, నియమనిష్టలతో తయారుచేస్తాయి. అందులో వాడే దినుసులు, నెయ్యి చాలా నాణ్యమైనవి వాడతారు. తయారీ విధానం కూడా అర్చక స్వాముల ఆధ్వర్యంలోనే కొనసాగుతుంది. కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో మనకు ఎన్నో విశిష్టమైన ఆలయాలు ఉన్నాయి. ఆయా ఆలయాల్లో ప్రసాదాలకూ ఎంతో ప్రత్యేకత ఉంది. ప్రధానంగా అన్నవరం ప్రసాదం అంటే అందరికీ చాలా ఇష్టం. ఇతర ఆలయాల్లోనూ లడ్డూలు, పులిహోర ప్రసాదాలు ఎంతో రుచిగా రూపొందిస్తారు. మన ఆలయాల్లో ప్రసాదాల ప్రత్యేకతలపై కథనం..

ఆలయాల్లో ప్రసాదాలంటే ఇష్టపడని వారుంటారా..
అన్నవరం ప్రసాదానికి అంతర్జాతీయ ఖ్యాతి
వాడపల్లి సహా ఇతర అన్ని ప్రసిద్ధ ఆలయాల్లోనూ నియమ నిష్టలతో తయారీ
ప్రసాదాల్లో రవ్వ లడ్డూలు, బూందీ లడ్డూలు, పులిహోర..
దేని ప్రత్యేకత దానిదే





అమృతతుల్యం.. అన్నవరం ప్రసాదం

అన్నవరం అనగానే గుర్తొచ్చేది సత్యదేవుడి గోధుమరవ్వ ప్రసాదం. ఇది ఎంతో అమృతతుల్యంగా ఉండడం, విస్తరాకులో అందించడంతో అన్నవరం సామి ప్రసాదం ఆకుతో నాకేయాలి అంటూ చలోక్తులు విసురుతుంటారు. అన్నవరంలో గోధుమరవ్వ ప్రసాదం ఎందుకు తయారుచేస్తారో పురాణ కథ ప్రచారంలో ఉంది. స్కాంద పురాణంలో శూతమహాముని శౌనికాది మునులకు దీని గురించి వివరిస్తారట. గోధుమరవ్వ, పాలు, ఆవునెయ్యి, పంచదార, సుగంధ ద్రవ్యాలతో తయారుచేసి సత్యదేవుడికి నైవేద్యం సమర్పించి ప్రసాదంగా తీసుకోవాలని చెబుతారు. 1891లో సత్యదేవుడి ఆలయం ఆవిర్భావం జరిగింది. అప్పటినుంచి స్వామివారి ఆలయంలో గోధుమరవ్వ ప్రసాదం భక్తులకు అందిస్తున్నారు. ఏటా రెండు కోట్ల ప్యాకెట్లను భక్తులకు విక్రయిస్తుంటారు. ఏ ఆలయంలో అయినా పులిహోర, లడ్డూ ప్రసాదంగా ఉండగా దేశవ్యాప్తంగా అన్నవరం ఆలయంలోనే గోధుమరవ్వ ప్రసాదంగా అందిస్తారు. స్వచ్ఛమైన వేడినీటిలో గోధుమరవ్వను ఉడికించి, ఆవునెయ్యి, పంచదార, సుగంధ ద్రవ్యాలతో వీటిని వంటస్వాములు తయారుచేస్తారు. ఈ ప్రసాదానికి ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు లభించింది.

బంగీప్రసాదం: సత్యదేవుడి ఆలయంలో గోధుమరవ్వ ప్రసాదంతోపాటు బంగీప్రసాదం విక్రయిస్తారు. కరాచీ రవ్వతో తయారుచేసే ప్రసాదంలో జీడిపప్పు, కిస్మిస్ కూడా వేస్తారు. వారం వరకు నిల్వ ఉండడంతో దూర ప్రాంతాలు ప్రయాణించే భక్తులు వీటిని తీసుకెళతారు. ఏటా సుమారు 20 లక్షల బంగీప్రసాదం ప్యాకెట్లను విక్రయిస్తారు. ఇక ప్రసాద విక్రయాల ద్వారా రూ.40 కోట్లు గోధుమరవ్వ ద్వారానూ, బంగీ ప్రసాదం ద్వారా రూ.10 కోట్లు లభిస్తోంది.

\- ఆంధ్రజ్యోతి/అన్నవరం



బంగీ ప్రసాదం





ప్రీతికరం.. అంతర్వేది స్వామివారి లడ్డూ

అంతర్వేది నవంబరు 2: దక్షిణకాశీగా పేరొందిన అంతర్వేది పుణ్యక్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామివారు ప్రతి ఇంట ఇలవేల్పుగా భావిస్తూ పశ్చిమ ముఖంగా దర్శనమిస్తారు. కొన్నిసంవత్సరాలుగా ఎంతో ప్రీతికరమైన స్వామివారి లడ్డూను భక్తులు ఎంతో ఇష్టంగా కొనుగోలు చేస్తారు. ఒక లడ్డూ ధర రూ.15. ఆలయంలోనే సిబ్బందితో ఈ లడ్డూ తయారుచేస్తారు. ఒక పాకానికి సుమారు 500 లడ్డూలు దాటి తయారవుతాయి. దసరా, కార్తీకమాసం, సంక్రాంతి పర్వదినాలతోపాటు విశేషమైన రోజుల్లో భక్తులు ఎక్కువగా లడ్డూను కొనుగోలు చేస్తారు. లడ్డూ తయారీకి శనగపప్పును ఆలయంలోనే మిల్లింగ్ చేసి పిండి ఆడతారు. విశాఖ డెయిరీ నెయ్యిని, టెండరు ప్రక్రియ ద్వారా కిరాణా సరుకులు లడ్డూ తయారీలో వినియోగిస్తారు.



మురమళ్లలో కల్యాణం లడ్డూలు ఉచితంగా..

ఐ.పోలవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఐ.పోలవరం మండలం మురమళ్లలో వీరేశ్వరస్వామి నిత్యకల్యాణోత్సవాలు జరుగుతాయని తెలిసిందే. ఇక్కడ కల్యాణం సందర్భంగా ఉచితంగా లడ్డూలు ఇస్తారు. సుదీర్ఘకాలం అనుభవం ఉన్న వంటస్వామి విశ్వనాథ సత్యనారాయణ ప్రసాదం తయారు చేస్తారు. 1982 నుంచి 2012 వరకు విజయవాడ కనకదుర్గ ఆలయంలో ఆయన పనిచేశారు. లడ్డూ తయారీ శనగపిండి, పంచదార, నెయ్యి, జీడిపప్పు, కిస్మిస్, యాలకులు, కర్పూరం, జాజికాయ వినియోగిస్తారు. కళ్యాణం భక్తులకు 180గ్రా.ల లడ్డూ ఉచితంగా ఇస్తారు. సాధారణ భక్తులకు 80గ్రా.ల లడ్డూ పది రూపాయలకు అందజేస్తారు. పులిహోర ఇక్కడ ప్రత్యేక రుచితో ఉండడం విశేషం.



వెంకన్న లడ్డూ.. భలే రుచి

ఆత్రేయపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తున్నారు. ఏడు శనివారాల నోము ఆచరిస్తున్న భక్తులు వేలాదిగా వచ్చి స్వామిని దర్శించుకుంటున్నారు. ఈ క్షేత్రంలో స్వామివారి లడ్డూ ఎంతో ప్రాచుర్యం పొందింది. 2007 నుంచి ఆలయంలోనే స్వామివారి లడ్డూను తయారుచేస్తున్నారు. ఆలయ ప్రాకార మండపంలో ప్రసాదశాలను నిర్మించారు. కొయంబత్తూరు నుంచి లడ్డూ తయారీకి ప్రత్యేక మిషనరీ తీసుకువచ్చి గ్యాస్ ద్వారా స్వామివారి ప్రసాదం నియమనిబంధనలతో తయారుచేస్తున్నారు. తిరుపతి తరహాలో స్వామివారి లడ్డూను తయారు చేయడం గమనార్హం. ప్రతిరోజూ 31 మంది సిబ్బంది స్వామివారి లడ్డూ తయారీలో నిమగ్నమవుతున్నారు. నెలకు 2.51 లక్షల లడ్డూను తయారు చేస్తూ ఒక్కొక్క లడ్డూ రూ.15కు విక్రయిస్తున్నారు. పచ్చకర్పూరం, జాజికాయ, యాలికలు, కిస్మిస్, జీడిపప్పు, హెరిటేజ్ నెయ్యి, శెనగపిండి, పంచదారతో స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని అందిస్తున్నారు.



వాడపల్లిలో తయారైన బూంది లడ్డూలు.. తయారు చేస్తున్న దృశ్యం



భీమేశ్వరుని ప్రసాదం.. అద్భుతం

ద్రాక్షారామ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రాచీన శైవక్షేత్రం.. పంచారామం ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ప్రసాదం తయారీ విక్రయాలు 33 ఏళ్ల కిందట ప్రారంభించారు. పులిహోర, రవ్వలడ్డూ, బూంది లడ్డూ ప్రసాదాలు భక్తులకు అందుబాటులో ఉంటాయి. తొలుత బయట వంట బ్రాహ్మణులకు తయారీ అవకాశం ఇచ్చేవారు. తర్వాత ఆలయ బేడా మండపంలో పాకశాలలో తయారుచేసేవారు. ప్రస్తుతం అన్నప్రసాద భవనం అందుబాటులోకి రావడంతో ప్రసాదాల తయారీ అక్కడే చేస్తున్నారు. బూంది లడ్డూ తయారీకి శనగపిండి, పంచదార, జీడిపప్పు, కిస్మిస్‌లు, యాలకులు, ఆవునెయ్యి, పచ్చకర్పూరం, సన్‌ఫ్లవర్ ఆయిల్ వాడుతారు. రవ్వలడ్డూ తయారీకి పంచదార, ఆవునెయ్యి, యాలకులు, కరాచీరవ్వ, జీడిపప్పు, కిస్‌మిస్ వాడుతారు. పులిహోర తయారీ కూడా ప్రత్యేకం. నాణ్యమైన దినుసులే వాడతారు. ప్రసాదాలను ఆలయంలో ప్రత్యేక కౌంటర్లు ద్వారా విక్రయాలు జరుపుతారు. 2023-2024 ఏడాదిలో ప్రసాదాలు విక్రయం ద్వారా రూ.44,39,365 సమకూరింది. ప్రసాదాలు తయారీకి రూ.31,00,391 ఖర్చుచేశారు.

పాదగయ రవ్వలడ్డూ.. ఉత్తరాదికి ప్రీతి

పిఠాపురం,నవంబరు2(ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రంలో రవ్వ లడ్డూ ప్రసాదానికి విశిష్టత ఉంది. ఉత్తరాది రాష్ట్రాల భక్తులు ఎక్కువగా ప్రసాదాన్ని కొనుగోలు చేస్తూ ఉంటారు. పులిహోర ప్రసాదం కూడా ఇక్కడ అందుబాటులో ఉంటుంది. పాదగయలో స్వయంభువు కుక్కుటేశ్వరస్వామి, ఆదిశంకరాచార్య ప్రతిష్ఠించిన రాజరాజేశ్వరీదేవి, అష్టాదశశక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్ఠాన దేవతైన పురుహూతికాఅమ్మవారు, స్వయంభువు దత్తాత్రేయస్వామి దర్శనాలకు ఉభయ తెలుగురాష్ట్రాలతోపాటు ఉత్తరాది రాష్ట్రాలు, ఒడిశా, కర్నాటక, గోవా, పశ్చిమ బెంగాల్‌నుంచి భక్తులు అధికంగా వస్తుంటారు. ఇక్కడకు వచ్చిన భక్తులు దర్శనాల తర్వాత తప్పనిసరిగా ఇక్కడ లభించే రవ్వ లడ్డూ ప్రసాదాన్ని తీసుకుంటారు. మిగిలిన దేవస్థానాలకు భిన్నంగా ఈ రవ్వ లడ్డూ ఉంటుంది. కరాచి నూక, పంచదార, నెయ్యి, కిస్‌మిస్, యాలకులు వినియోగిస్తారు. పాలు వాడరు. ఒక్కో రవ్వలడ్డూ ప్రసాదాన్ని రూ.15కి విక్రయిస్తున్నారు. పులిహోర ప్రసాదం రూ.10కి విక్రయిస్తారు. మహాశివరాత్రి, శరన్నవరాత్రులు, కార్తీక, శ్రావణమాసాలు వంటి పర్వదినాల్లో రవ్వలడ్డూ ప్రసాదాలకు అధిక డిమాండ్ ఉంటుందని ఈవో జగన్మోహన్ శ్రీనివాస్ తెలిపారు.

బాలబాలాజీ లడ్డూ.. ఆహా ఏమి రుచి

మామిడికుదురు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వైనతేయ నదీ తీరంలో బాలతిరుపతిగా వర్ధిల్లుతున్న అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం లడ్డూ ప్రసాదాన్ని భక్తులు పవిత్రంగా భావిస్తారు. మొదట్లో ఆలయ నిర్మాత మొల్లేటి రామస్వామి బూరి, పులిహోర ప్రసాదంగా అందించేవారు. 1981 సంవత్సరంలో ఆలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. స్వచ్ఛమైన నెయ్యితో 80 గ్రాముల బరువుగల లడ్డూను రూ.15కి విక్రయిస్తున్నారు. స్వచ్ఛమైన నెయ్యితో తయారు ఈ లడ్డూను భక్తులు ఇష్టంగా తింటారు.



పంచారామ.. ప్రసాదం

సామర్లకోట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో కరాచీ (తెల్లనూక) నూక లడ్డూను విక్రయిస్తున్నారు. ప్రతిరోజూ పులిహోర ప్రసాదంతోపాటు కరాచీ నూక లడ్డూలు కూడా ఆలయం వద్ద భక్తులకు విక్రయిస్తుంటారు. ప్రస్తుతం ఆలయంలోనే తయారుచేస్తున్నారు.

రేపటి నుంచి డిప్యూటీ సీఎం పవన్ పర్యటన

మునిసిపల్ శాఖా మంత్రి నారాయణ వచ్చే అవకాశం

ఏర్పాట్లు పరిశీలించిన కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



గొల్లప్రోలులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటించే ప్రాంతాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

పిఠాపురం/గొల్లప్రోలు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ 4, 5 తేదీల్లో కాకినాడ జిల్లాలో పర్యటించనున్నారు. పిఠాపురం, కాకినాడ రూరల్ నియోజకవర్గాల్లో జరిగే పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. ఈ పర్యటనకు రాష్ట్ర మునిసిపల్‌శాఖా మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పి.నారాయణ వచ్చే అవకాశాలు ఉన్నాయి. డిప్యూటీ సీఎం పర్యటించే ప్రాంతాలను కాకినాడ జిల్లా కలెక్టరు షాన్‌మోహన్ పరిశీలించారు. సభ ఏర్పా టుకు ఉన్న అవకాశాలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు సంబంధించి ఆయా శాఖల అధికారులతో మాట్లాడారు. కలెక్టర్ వెంట కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, తహసీల్దారు సత్యనారాయణ, ఎంపీడీవో కర్రి స్వప్న, నగర పంచాయతీ కమిషనరు రవికుమార్, పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రామకృష్ణ ఉన్నారు.

పిఠాపురం నియోజకవర్గంలో రెండురోజుల పాటు డిప్యూటీ సీఎం పవన్ పర్యటించనున్నారు. సోమవారం 10 గంటలకు రాజమహేంద్రవరం విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి 11.30 గంటలకు గొల్లప్రోలు చేరుకుంటారు. పిఠాపురం నియోజకవర్గానికి సంబంధించి పలు ప్రారంభోత్సవాలు చేస్తారు. సాయంత్రం కాకినాడ రూరల్ మండలం పి.వెంకటాపురంలో ఏపీఎస్‌డ బ్లూఆర్‌ఈఐ ఇనిస్టిట్యూట్‌ను సందర్శిస్తారు. రాత్రి గొల్లప్రోలు మండలం చేబ్రోలులో బస చేస్తారు. కొత్తపల్లిలో 5న పలు శంకుస్థాపనలు చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి రాజమహేంద్రవరం విమానాశ్రయానికి వెళతారు. కాగా 4వ తేదీ పవన్‌కల్యాణ్ పర్యటనలో మంత్రి నారాయణ కూడా పాల్గొనే అవకాశాలు ఉన్నాయి.



ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారుడు



కాకినాడ డీఎస్ఏ మైదానంలో వివిధ పోటీల ఎంపికకు హాజరైన క్రీడాకారులు

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపికలు

కాకినాడ అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వివిధ క్రీడల్లో రాష్ట్రస్థాయి పోటీలకు హాజరయ్యే జిల్లాస్థాయి క్రీడాకారులను కాకినాడ డీఎస్ఏ మైదానంలో శనివారం ఎంపిక చేశారు. పాఠశాలల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎల్.జార్జి ఎంపికలను ప్రారంభించారు. అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికలకు బేస్‌బాల్, జిమ్నాస్టిక్స్, మోడరన్ పెంటతలాన్, రోల్‌బాల్‌ల్లో ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో ఎంపికైన వారు రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొంటారని జార్జి తెలిపారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో చిత్తూరులో జరిగే అండర్-14 బేస్‌బాల్, అండర్-17 విభాగం గుంటూరులో నిర్వహిస్తారన్నారు. మోడరన్ పెంటతలాన్‌లో 9, 10 తేదీల్లో శ్రీకాకుళంలో నిర్వహిస్తారన్నారు. ఈనెల 7, 8, 9 తేదీల్లో జిమ్నాస్టిక్స్ రాష్ట్రస్థాయి పోటీలు కాకినాడ డీఎస్ఏ మైదానంలో జరుగుతాయన్నారు.

ఘనంగా టీఎన్ఏఐ ద్వైవార్షిక సమావేశం

- నర్సింగ్‌లో నాయకత్వ లక్షణాలపై అవగాహన
- హాజరైన 2500 మంది నర్సింగ్ విద్యార్థులు
- ముఖ్య అతిథిగా ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ నరసింహం

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ వివేకానంద పార్కు ప్రాంగణంలోని ఫ్యాబిన్ కన్వెన్షన్ హాల్లో శనివారం 78వ ది ట్రైన్డ్ నర్సస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (టీఎన్ఏఐ) ఆంధ్రప్రదేశ్ శాఖ ద్వైవార్షిక సమావేశం జరిగింది. సదస్సుకు రాష్ట్రవ్యాప్తంగా 2,500 మంది నర్సింగ్ విద్యార్థులు హాజరయ్యారు. టీఎన్ఏఐ, ఆర్ఎంసీ నర్సింగ్ కాలేజ్ సంయుక్త ఆధ్వర్యంలో సీఆర్ సంసీర్ బేగం, సంఘ కార్యదర్శి, ఏపీఎన్ఎంసీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.సుశీల పర్యవేక్షణలో సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం హాజరయ్యారు. అతిథిగా ఐఆర్‌సీ వ్యవస్థాపకుడు విశ్రాంత డీఎంహెచ్‌వో డాక్టర్ చక్రధర్ హాజరయ్యారు. ప్రధాన అజెండా లీడర్‌షిప్ ఇన్ నర్సింగ్ ఇన్‌స్పైరింగ్ విజన్ డ్రైవింగ్ చేంజస్ అంశంపై సమావేశం జరిగింది. సదస్సులో డాక్టర్ నరసింహం మాట్లాడుతూ నర్సింగ్ విద్యలోకి అడుగుపెట్టారంటే కచ్చితంగా వారికి సేవా భావం ఉన్న వ్యక్తులై ఉంటారన్నారు. ఈ వృత్తి కన్నా వేరే వృత్తుల్లో జీతభత్యాలు అధికంగా ఉన్నా నర్సింగ్ వైపు మొగ్గు చూపారంటే వారి సేవా గుణం కొనియాడదగిందన్నారు. నర్సింగ్ రంగంలో మారుతున్న ఆధునికతను అందిపుచ్చుకుని నర్సింగ్ వృత్తికి వన్నె తేవాలన్నారు. సదస్సులో ఏపీడీఎంఈ కార్యాలయ నర్సింగ్ డీడీ ఎస్.జ్యోతి, ఆర్ఎంసీ నర్సింగ్ ప్రిన్సిపాల్ ఎం.మునిరత్నమ్మ హాజరయ్యారు. సదస్సులో భాగంగా సైంటిఫిక్ పేపరు ప్రజెంటేషన్ చేపట్టారు. ప్లీనరీ సెక్షన్స్‌లో నర్సింగ్ ప్రాధాన్యాన్ని వివరించి ఇటీవల జరిగిన అధునాతన మార్పులను ప్రస్తావించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ నరసింహం తదితరులు

ముగిసిన ఉమ్మడి తూర్పుగోదావరి క్రీడాకారుల ఎంపిక

తొండంగి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయిలో రోప్ స్కిప్పింగ్, మాల్కమ్ క్రీడల్లో రాష్ట్ర ఈవెంట్‌లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక శనివారం పూర్తయ్యింది. కాకినాడ జిల్లా తొండంగి మండలం రావికంపాడు ఉన్నత పాఠశాలలో జరిగిన ఎంపికలో 20 పాఠశాలలకు చెందిన 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రెండు విభాగాల్లోను అండర్ 14, 17లలో బాలబాలికలు హాజరయ్యారు. మాల్కమ్ అండర్ 14 బాలికల విభాగంలో కర్రి దేవి, కోశెట్టి దీప్తి, బత్తిన మురారి దివ్య, దంగా భారతి ఎంపికయ్యారు. బాలుర విభాగంలో కోశెట్టి తనూజ్, ఆర్.సూర్య, ఎ.సంతోష్‌కుమార్, జి.రాహుల్, కె.శర్విన్‌బాబు, సీహెచ్ వరుణ్‌తేజ ఎంపికయ్యారు. రోప్ స్కిప్పింగ్‌లో కె.తనూజ్, ఆర్.సూర్య, కె.బాబు, సీహెచ్ కల్యాణ్‌రావు దొర, వరుణ్ తేజ దొర, ఎస్.సుజన్, ఎం.మౌళి, కె.శర్విన్ బాబులు ఎంపికయ్యారు. వారంతా ఈనెల 8 నుంచి 10 వరకు భీమవరంలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటారు. వివిధ పాఠశాలల పీడీలు క్రీడా నిర్వహణ నిమిత్తం హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ప్రసాదరావు, పీడీ కె.నర్సింహమూర్తి, విక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పీడీలు


పాపికొండల విహారయాత్రకు వెళుతున్న బోటు

పాపికొండలకు పర్యాటకుల సందడి

దేవీపట్నం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లాలో పాపికొండలు అందాలు తిలకించేందుకు పర్యాటకులు శనివారం గోదావరి ముంపు పరివాహక ప్రాంతాలైన పూడిపల్లి, దేవీపట్నం, మంటూరు, కొండమొదలు తదితర గ్రామాల మీదుగా మండలంలో పోశమ్మగండి బోటు పాయింట్ నుంచి రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 250 మంది పాపికొండలు వెళ్లారు. ముందుగా గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకుని బోట్లలో తరలివెళ్లారు.



అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు న్యాయనిర్ణేతలుగా కోనసీమవాసులు

అమలాపురం టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగే అంతర్జాతీయ పోటీలకు న్యాయనిర్ణేతలుగా కోనసీమ జిల్లాకు చెందిన ఇద్దరిని నియమించారు. కొంకాపల్లికి చెందిన బ్యాడ్మింటన్ గ్రేడ్-1 నేషనల్ అంపైర్ పాయసం శ్రీనివాసరావు, కామనగరువు జడ్పీ ఉన్నత పాఠశాల పీడీగా పనిచేస్తున్న గొలకోటి శ్రీనివాస్‌ను ప్రతిష్టాత్మకమైన కొటాక్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ చాలెంజ్ టోర్నమెంట్‌కు న్యాయనిర్ణేతలుగా నియమించారు. ఈనెల 5 నుంచి హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో ఈ పోటీలు జరుగుతాయి. శ్రీనివాసరావులను అంతర్జాతీయ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్‌తోపాటు కొత్తపల్లి బాబు, కోనసీమశాఖ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, శరత్‌బాబు, కాశీవిశ్వనాథం, బీవీసీ విద్యాసంస్థల అధినేత బోనం కనకయ్య, పల్లంరాజు అభినందించారు.



రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో కార్తీక స్నానాలు ఆచరిస్తున్న భక్తులు, గోదావరిలో అరటిదొప్పలో దీపాలు వదులుతున్న భక్తురాలు

శివోహం!

- పాడ్యమి దీపాలు వదిలిన భక్తులు
- శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో కార్తీకమాసం తొలిరోజున శైవక్షేత్రాలు కార్తీకమాస శోభ చేకూరింది. .కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా శనివారం తెల్లవారుజామున రెండు గంటలకే భక్తుల రాక ప్రారంభమైంది. రాజమహేంద్రవరంలోని పుష్కరాలరేవు, కోటిలింగాల రేవు, దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రం, ద్రాక్షారామ భీమేశ్వరాలయంవద్ద పుష్కరిణి, కోటిపల్లి ఛాయా సోమేశ్వరస్వామి ఆలయం, సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయాల వద్ద భక్తులతో కిక్కిరిశాయి. కార్తీకమాసానికి ప్రారంభ సూచకంగా భక్తులు అరటిదొప్పల్లో పాడ్యమి దీపాలు వెలిగించి వదిలారు.



పిఠాపురం పాదగయ పుష్కరిణిలో అరటిదొప్పలో పాడ్యమి దీపాలు వెలిగించి వదులుతున్న భక్తులు, పూజలు చేస్తున్న మహిళలు

రత్నగిరిపై కార్తీక సందడి

- సత్యదేవుడికి కార్తీకమాస తొలిరోజు ఆదాయం రూ.40 లక్షలు
- ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఈవో రామచంద్రమోహన్


రత్నగిరి కొండపై వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అన్నవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో కార్తీకమాస సందడి ప్రారంభమైంది. తొలిరోజు సుమారు 50 వేలమంది భక్తులు దర్శించుకోగా రూ.40లక్షల ఆదాయం లభించింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని 4 గంటల నుంచి స్వామివారి వ్రతాలు, దర్శనాలు ప్రారంభించారు. 2952 జంటలు సత్యదేవుడి వ్రతాలాచరించారు. ఈవో రామచంద్రమోహన్ క్షేత్రస్థాయిలో వ్రతమండపాలు, క్యూలైన్‌లను ప్రారంభించారు. ప్రధానాలయం వద్ద అదనంగా 1200 మంది భక్తులకు సౌకర్యవంతంగా ఉండే క్యూలైన్‌ను, సిట్టింగ్, ఫ్యాన్లు ఏర్పాటుచేసిన క్యూలైన్‌లను పరిశీలించారు. పశ్చిమరాజగోపురం వద్ద ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యన్నదాన పథకానికి శనివారం అన్నవరం గ్రామానికి చెందిన వీర్ల సత్యసాయితేజ తన మొదటినెల జీతానికి సత్యదేవుడికి సమర్పిస్తానని మొక్కుకోవడంతో రూ.లక్ష విరాళంగా ఈవో రామచంద్రమోహన్‌కు అందజేశారు. దాతను ఆయన అభినందించారు.

సమాచార కమిషనర్ పూజలు

రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో శనివారం సమాచార కమిషనర్ ఉదయభాస్కరరెడ్డి స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు చేశారు. ఆయనకు ఆలయ ప్రోటోకాల్ సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

ప్రాకారసేవ, రథోత్సవం సాయంత్రానికి మార్పు

సత్యదేవుడి సన్నిధిలో ఉదయం సమయంలో ప్రతి శనివారం నిర్వహించే ప్రాకారసేవ, ఆదివారం నిర్వహించే ఆర్జితసేవ రథోత్సవం కార్తీక మాసం నెలరోజులు భక్తుల రద్దీదృష్ట్యా సాయంత్రం 4.30కి నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రామచంద్రమోహన్ పేర్కొన్నారు. కార్తీకమాసం అనంతరం ఈసేవలు యథావిధిగా ఉదయం జరుగుతాయని రథపాత్‌లో భక్తుల సంచారం శని, ఆదివారాల్లో అధికంగా ఉండడంతో పండితులతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు.


వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి

గోవిందా..హరి గోవిందా!

- వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం
- వాడపల్లి ఒక్కరోజు ఆదాయం రూ.45.33లక్షలు


వాడపల్లి వెంకన్న ఆలయంవద్ద బారులుతీరిన భక్తులు


బాలబాలాజీకి పూజలు చేస్తున్న అర్చకుడు

ఆత్రేయపురం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామికి సుప్రభాతసేవ, ఐశ్వర్య లక్ష్మిహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల స్వామివారిని దర్శించుకున్న భక్తులు గోవిందనామస్మరణతో స్వామిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు స్వామిని దర్శించుకున్నారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. స్వామివారి ఆలయంలో రామానుజ తిరునక్షత్ర ఉత్సవాలు రెండోరోజు నిర్వహించారు. ప్రకారోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. వివిధసేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.45.33లక్షలు లభించిన ట్లు ఉప కమిషనర్, ఈవో సూర్యచక్రధరరావు తెలిపారు.

శృంగారవల్లభస్వామికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి వారిని భక్తులు శనివారం దర్శించుకున్నారు. తెల్లవారు జాము నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ. 2,81,730, అన్నదాన విరాళాలు రూ.74,221 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.5,480, తులాభారం, కానుకలు ద్వారా రూ.350, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.23,160 వెరసి రూ.3,84,941 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు పులిహోర, అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. సుమారు 10వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణా చార్యులు తదితరులు పాల్గొన్నారు.

బాలబాలాజీ స్వామికి విశేష పూజలు

మామిడికుదురు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి శనివారం పురస్కరించుకుని అర్చకస్వాములు విశేష పూజలు నిర్వహించారు. శనివారం దేవస్థానం భక్తుల తాకిడితో కిటకిటలాడింది. కార్తీకమాసం ప్రారంభంకావడంతో వేకువజాము నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. స్వామివారికి శనివారం సుప్రభాత సేవ, తొలిహారతి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ జరిపారు. నిత్యాన్నదానంలో అన్నప్రసాదం స్వీకరించేందుకు భక్తులు బారులు తీరారు. శనివారం ఒక్కరోజు వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,53,765 ఆదాయం వచ్చిందని, స్వామివారిని 5,540మంది భక్తులు దర్శించుకుని 3386 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని ఆలయ సహాయకమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.


తిరుపతి శృంగారవల్లభస్వామి

చిక్కని పులి

- పట్టు రైతులకు అపార నష్టం
- పంటను వదిలేస్తున్న గిరిజనులు


పట్టుపురుగులు చూపుతున్న తెల్లం గోపయ్య, శాంతమ్మ దంపతులు

కూనవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మన్యంలో పులి సంచారం గిరిజన రైతులకు నష్టం వాటిల్లేలా చేస్తోంది. ప్రతీ ఏడాది గిరిజనులు అడవిలో పట్టుపురుగులు సాగు చేస్తుంటారు. అందులో భాగంగానే ఈఏడాది కూడా స్థానిక గిరిజనులు అడవిలో సాగు చేస్తున్నారు. మొత్తం 3 దఫాలుగా పట్టు పురుగులు సాగు చేస్తారు. ప్రతీ పట్టుపురుగుల సాగుకు రూ.20 వేల నుంచి రూ.30వేలు సంపాదిస్తారు. ఇప్పటికే గిరిజనులు తొలి పంట పూర్తిచేసుకుని రెండోపంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం రెండో పంట పురుగుదశలో ఉంది. ఈ దశలో ప్రతీరోజూ వెళ్లి పురుగులు పిట్టలుభారిన పడకుండా చూడాలి. పులి సంచార భయంతో అడవిలోకి వెళ్లాలంటేనే గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. అందులో భాగంగానే గిన్నెలగూడెంనకు చెందిన కొంతమంది గిరిజన రైతు లు మండలంలోని దట్టమైన అడవిలో ఈ టసార్ పట్టు పురుగుల పంటను సాగు చేస్తున్నారు. అయితే అడవిలోకి వెళ్లలేక ఆ పంటను వారు సాగు చేయడం మానేశారు. దీంతో ఒక్కొక్కరికీ రూ.30వేలు వరకు నష్టం వాటిల్లింది. మరికొంతమంది రోడ్డు పక్కన అడవుల్లో ఈ పట్టుపురుగు పంటను సాగు చేస్తున్నారు. గతంలో ఒక్కొక్కరే వెళ్లి పంట సాగు చేసుకు నే వారు. కానీ ఈసారి గుంపులు, గుంపులుగా వెళ్లి పంటను సాగు చేసుకుని ఇంటికి వస్తున్నారు. ఆర్థికంగా నష్టపోయిన తమకు ప్రభుత్వం సాయం చేయాలని పలువురు గిరిజనులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. భగవాన్‌పురంలో పట్టుపురుగుల పంటను సాగుచేస్తున్న సుధాకర్ అనే వ్యక్తి అడవిలోకి వెళ్లగా పులి కనిపించడంతో ఒక్కసారిగా ఆ వ్యక్తి పట్టుపురుగుల పంటకు వెళ్లడానికి భయపడుతున్నాడు.

కొనసాగుతున్న పులి అలజడి

కూనవరం మన్యంలో పులి అలజడి కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే తమకు కళ్లెదుటే పులి కనిపించిందంటూ పలువురు గిరిజనులు తెలుపుతున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళుతున్న వారికి సైతం రోడ్డుకు అడ్డంగా పడుకుని ఉండడంతో భయాందోళనకు చెందినట్లు బోదునూరు వాసులు తెలిపారు. కూనవరం అడవుల్లో ఆది నుంచి పులి అలజడి కొనసాగుతూనే ఉంది. 60 సంవత్సరాల క్రితం మండలంలోని చిన్నబోయిన కన్నయ్య మేకలు తోలుతూ ఉండగా అతనిపై అప్పట్లో చిరుతపులి దాడి చేసింది. అదేవిధంగా పదేళ్ల క్రితం వీఆర్‌పురం మండలంలో బూరుగువాడ గ్రామంలో ఒకేరోజు 15 ఎద్దులపై దాడిచేసిన సంఘటన జరిగింది. 2010లో రామచంద్రాపురం అడవుల్లో ఓ పశువుపై దాడిచేసినట్లు ప్రచారం జరిగింది. మరలా ఇప్పుడు పులి పశువులపై దాడిచేస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

పట్టు పురుగులు సాగు చేయాలంటే భయమేస్తోంది

● తెల్లం గోపయ్య

అడవిలోకి వెళ్లి పట్టుపురుగులు సాగు చేయాలంటే భయమేస్తుంది. గతంలో ఒక్కరమే వెళ్లి సాగు చేసేవాళ్లం. ఇప్పుడు పులి భయంతో కుటుంబం మొత్తం వెళ్లి పట్టుపురుగుల పంట సాగు చేయాల్సి వస్తోంది. మరికొంతమంది పంట సాగు చేయలేక అడవిలోనే వదిలేశారు.

మేలు జరిగేలా నూతన కౌలు చట్టం

- రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్


కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్

అమలాపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): భూ యజమానులకు ఇబ్బంది లేకుండా కౌలు రైతులకు మేలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం నూతన కౌలు చట్టాన్ని తీసుకువస్తున్నట్టు వ్యవసాయ, సెరీకల్చర్, మార్కెటింగ్ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో 80శాతం భూములను కౌలు రైతులే సాగు చేస్తున్నారన్నారు. క్షేత్ర స్థాయిలో వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులు ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారన్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక పంట నష్టం సంభవిస్తే ప్రభుత్వపరంగా అందాల్సిన బీమా, ఇన్‌పుట్ సబ్సిడీలు కౌలు రైతులకు అందడం లేదన్నారు. భూ యజమానులకు సీసీఆర్సీ కార్డుల మీద అపోహలు ఉండడంవల్ల ఈ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు మంజూరుకాకపోవడంతో బ్యాంకుల్లో వారికి పంట రుణాలు కూడా లభించడం లేదన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం భూ యజమానులకు భరోసా కల్పిస్తూ కౌలుదారులకు పంట రుణాలు అందేలా నూతన సాగుదారుల హక్కుచట్టం-2024ను రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందన్నారు. ఇప్పటికే ముసాయిదాను రూపొందిస్తామన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి భూ యజమానులు, కౌలుదారులతో సమావేశాలు నిర్వహించి సలహాలు, సూచనలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించినట్టు ఆయన తెలిపారు. దీనిలో భాగంగా జిల్లాల వారీగా పర్యటనలు చేస్తున్నామన్నారు. అమలాపురం కలెక్టరేట్‌లో శనివారం కాకినాడ, కోనసీమ జిల్లాలకు చెందిన భూ యజమానులు, కౌలుదారులతో నిర్వహించిన ప్రాంతీయ సమావేశాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. రాష్ట్రంలో అమలవుతున్న కౌలు చట్టాలను రైతులకు ఆయన వివరించారు. 2019 సీసీఆర్సీ చట్ట ప్రకారం కౌలుదారులకు భూ యజమానుల అనుమతితో పదకొండు నెలల కాలపరిమితికి సీసీఆర్సీ కార్డులను రెవెన్యూశాఖ జారీ చేస్తుందన్నారు. అయితే ఈ చట్టంలోని లోపాల వల్ల ఎక్కువ మంది కౌలు రైతులు పంట రుణాలు పొందడంలేదని ప్రభుత్వం గ్రహించిందన్నారు. కౌలు రైతుల సమస్యలు గ్రహించడానికి నూతన చట్టం తీసుకువస్తున్నట్టు తెలిపారు. కొత్త చట్టంలో సీసీఆర్సీ కార్డు జారీ చేసేటప్పుడు భూ యజమాని సిఫార్సు అవసరం లేదన్నారు. వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు మాట్లాడుతూ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ఉపయోగించుకుని కౌలు రైతులకు కార్డులు జారీ చేయడంతోపాటు రుణాలు మంజూరుచేసే పలు అంశాలను వివరించారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మాట్లాడుతూ కౌలు రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతోపాటు అనేకపథకాలు అందేలా నూతన చట్టాన్ని రూపొందించేలా ప్రభుత్వం అభిప్రాయ సేకరణ చేపట్టిందన్నారు. ఎమ్మెల్సీలు యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ), కుడుపూడి సూర్యనారాయణరావు తదితరులు మాట్లాడారు. సమావేశంలో జేసీ టి.నిషాంతి, జిల్లా వ్యవసాయాధికారులు వి.బోసుబాబు, ఎన్.విజయ్‌కుమార్, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జాతి సమైక్యత చాటేందుకే వన సమారాధనలు

- కార్మికశాఖా మంత్రి సుభాష్

కాకినాడ సిటీ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జాతి సమైక్యతను చాటుకునేందుకు వన సమారాధనలు దోహదపడతాయని రాష్ట్ర కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామారావుపేట శెట్టిబలిజ కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ నెల 17న జరుగనున్న శెట్టిబలిజ వన సమారాధన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మం త్రి సుభాష్ మాట్లాడుతూ ఒకేచోట అందరూ కలిసి ఐక్యతను చాటి చెప్పడమే ధ్యేయంగా వనసమారాధన జరగాలన్నారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ శెట్టిబలిజ వర్గానికి చెందిన ప్రజలు సామాజిక వెనుకబాటులో ఉన్నారన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డైరెక్టర్ కడలి ఈశ్వరి, బీసీ నాయకులు నురుకుర్తి వెంకటేశ్వరరావు, చొల్లంగి వేణుగోపాల్, పెంకే శ్రీనివసబాబా, వాసంశెట్టి రాజేశ్వరావు,కుడుపూడి సత్తిబాబు, గుత్తుల శ్రీను, వాసం శెట్టి అంజిబాబు పాల్గొన్నారు.


వనసమారాధన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్

6వతేదీతో ముగుస్తున్న ఓటు నమోదు

- పట్టభద్రులు ఓటు నమోదుకు అవకాశం
- ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు 81213

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రులు నియోజకవర్గం ఓటర్లు జాబితా నమోదు ఈనెల 6వతేదీతో ముగుస్తుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డీఆర్వో వెంకట్రావు తెలిపారు. ఈ నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు తహసీల్దారు, ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు పట్టభద్రులుఓటుకోసం 81,213 దరఖాస్తులు వచ్చాయన్నారు. దీనిలో అల్లూరి సీతారామరాజు జిల్లా 988, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా 15987, తూర్పుగోదావరిజిల్లా 13836, ఏలూరు జిల్లా 14557, కాకినాడ జిల్లా 15183, పశ్చిమగోదావరి జిల్లా 20662 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిని పరిశీలించి ఈనెల 23న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించి అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు.

కన్నీరు మున్నీరుగా..

- శలపాకలో హత్యకు గురైన మృతులకు అంత్యక్రియలు పూర్తి
- కన్నీరుమున్నీరుగా విలపించిన కుటుంబీకులు, బంధువులు
- గ్రామంలో కొనసాగుతున్న 144సెక్షన్, పోలీస్ పికెటింగ్


రోదిస్తోన్న బత్తుల చిన్నయ్య కూతురు రాణి


విషాదంలో బత్తులరాజు భార్య లక్ష్మీ, కూతురు రాజేశ్వరి


ఆరునెలల చంటిబిడ్డతో విషాదంలో రమేష్ భార్య

కాకినాడ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మండలం శలపాక హత్యలతో గ్రామంలో పోలీస్ పికెటింగ్ కొనసాగుతోంది. అల్లర్లు జరుగకుండా విధించిన 144సెక్షన్‌ను మరికొన్ని రోజులు పొడిగించారు. కాగా హత్యకు గురైన బత్తుల చిన్నయ్య(42), బత్తుల రాజు(40), చిన్నయ్య కొడుకు బత్తుల రమేష్(25)కు కాకినాడ జీజీహెచ్‌లో శనివారం మధ్యాహ్నం పోస్టుమార్టం పూర్తయింది. దీంతో మృతదేహాలను శలపాకకు తరలించి అక్కడ అంత్యక్రియలు నిర్వహించారు. పొట్టకూటికోసం కువైట్ వెళ్లి అక్కడ పనిచేస్తున్న చిన్నయ్య, రాజుల భార్యలు అనసూయ, లక్ష్మీ తమ భర్తల హత్య గురించి తెలియడంతో హుటాహుటిన కువైట్ నుంచి బయలుదేరి గ్రామానికి వచ్చారు. కుటుంబం బాగు.కోసం తాము విదేశాలకు వెళ్లి ఉపాధి పొందుతుంటే తమ మగవాళ్లు హత్యకు గురవడంతో వీరిద్దరూ కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాలను చూసి బోరున విలపించారు. ఎంత ఘోరం జరిగిపోయింది. కనీసం గ్రామంలో ఎవరూ ఆపేవారే లేరా అంటూ కన్నీరుము న్నీరుగా విలపించారు. మృతదేహాల వద్ద కూర్చుని వీరిద్దరూ విలపిస్తున్న తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. చిన్నయ్య కూతురు, కొడుకు అయితే విగత జీవిగా పడి ఉన్న తండ్రిని చూసి గుండెలు బాదుకుని రోధించారు. బత్తుల రాజు కుమారుడు సూర్య అయితే విగతజీవిగా పడి ఉన్న తండ్రిని చూసి కన్నీరు మున్నీరుగా విలపించాడు. తామంతా కుటుంబం కోసం వేరే దేశాల్లో ఉండి పనిచేస్తున్నామని, తండ్రి గ్రామంలో క్షేమంగానే ఉన్నాడనుకుంటే ఇంత దారుణంగా హత్య చేస్తారా అంటూ రోధించాడు. మృతదేహాలను కొంతసేపు నివాసంవద్ద బంధువుల పరామర్శకు ఉంచగా వారి రోధనలు మిన్నంటాయి. బత్తుల రమేష్ హత్యకు గురవడంతో ఆరునెలల చంటిబిడ్డ అనాథగా మారడంతో తల్లి విలపిస్తూనే ఉంది. తనకు, బిడ్డకు దిక్కెవరంటూ రోదిస్తోంది. ఇంత చిన్న వయసులో తండ్రిని కోల్పోయిన బిడ్డకు రేపొద్దున ఏం చెప్పాలని, తామెలా బతకా లంటూ బోరున విలపిస్తోంది. హత్యకు పాల్పడిన ఐదుగురు నిందితుల్లో ఇప్పటికే ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు ఇంకా పరారీలోనే ఉండడంతో వారికోసం గాలిస్తున్నారు.

భక్తుల రద్దీకి తగినట్టు సిబ్బందిని పెంచుకోవాలి

గోదావరి రేవులను పరిశీలించిన మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం గోదావరి రేవులను నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ శనివారం పరిశీలించారు. కార్తీక మాసం ఆరంభం సందర్భంగా భక్తులకు అసౌకర్యం కలుగకుండా చేసిన ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలన చేసి పలు సూచనలు చేశారు. బురదగా ఉన్న చోట్ల ఇసుక వేయాలని, తగినన్ని డెస్ట్‌బిన్నులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సోమవారం అత్యధికంగా భక్తులు వస్తారు కాబట్టి అందుకు తగ్గట్టుగా సిబ్బందిని పెంచుకుని సేవలు అందించాలని సూచించారు. ఈ పనులకు సంబంధించి ఇంజినీర్లు, ఎమినిటీస్ కార్యదర్శులు పూర్తి బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈ ఐ.పాండురంగారావు, సీపీ కోటయ్య, డిప్యూటీ సిటీ ప్లానర్ సత్యనారాయణ రాజు, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఈఈలు, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

అనపర్తి తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా
డాక్టర్ రామగురెడ్డి

అనపర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అనపర్తి తాలూకా అధ్యక్షుడిగా అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ఏరియా ఆసుపత్రిలో సంఘం జిల్లా ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అనపర్తి తాలూకా నూతన కార్యవర్గాన్ని ఉద్యోగులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా రవిబాబు, కార్యదర్శిగా పిల్లి ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా జీ ఆనంద్, తిరుమలదేవి, ఆలీషాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వర్మ మాట్లాడుతూ జిల్లాలోని ఆరు తాలూకాలకు గాను ఇప్పటివరకు అనపర్తి సహా ఐదింటిలో నూతన కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. కోరుకొండ తాలూకాలో మరో కమిటీని ఏర్పాటు చేయనున్నామన్నారు. వచ్చే నెల 8న రాజమహేంద్రవరంలో జిల్లా స్థాయి సదస్సు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి విల్సన్, సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ తరుణ్ వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళ భద్రతపై శ్రద్ధ వహించాలి: డీఎస్పీ

కడియం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నర్సరీల్లో పనిచేసే మహిళల భద్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఎస్పీ భవ్యకిషోర్ తెలిపారు. సర్ ఆర్థర్‌కాటన్ నర్సరీ అసోసియేషన్ కార్యాలయం వద్ద నర్సరీ రైతులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నర్సరీల్లో ఎక్కువ శాతం మహిళలు పని చేస్తున్నారని, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మహిళల భద్రత పట్ల దృష్టి పెట్టాలన్నారు. నర్సరీల్లో పనిచేసే మగవారిపై నిఘా ఉంచాలన్నారు. ఎవరైనా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. చిన్న పిల్లలను పనుల్లో పెట్టుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో నర్సరీ సంఘం అధ్యక్షుడు మల్లు పోలరాజు, సీఐ ఎ.వెంకటేశ్వరరావు, నర్సరీసంఘం డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఇతర మండలాల వారిని వెనక్కి పెడుతున్నారు

ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ల ఘర్షణ



సీతానగరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్లపై ఇసుక లోడింగ్ విధానంలో ఇతర మండలాల నుంచి వచ్చిన వారిని వెనక్కి పెడుతున్నారని కోరుకొండ మండలం నుంచి వచ్చిన ట్రాక్టర్ డ్రైవర్లు గొడవకు దిగారు. దీంతో స్థానిక ట్రాక్టర్ డ్రైవర్లకు, ఇతర మండలాల నుంచి వచ్చిన డ్రైవర్లకు మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. అయితే ఇరువురు సర్దుబాటు చేసుకోవడంతో సద్దుమణిగింది. అయితే ట్రాక్టర్లు అధిక సంఖ్యలో కైలాస భూమి ర్యాంపు నుంచి వెళ్లడం వల్ల పంట భూములు పాడవుతున్నాయని రైతులు ఆందోళన చేపట్టడంతో పంట భూములకు ఇబ్బంది కలగకుండా రోజూ తడిపి దుమ్ము లేవకుండా చర్యలు తీసుకుంటామని ట్రాక్టర్ డ్రైవర్లు చెప్పడంతో రైతులు శాంతించారు.

డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవాధికార సంస్థలో శనివారం శాశ్వత లోక్ అదాలత్ ప్రజా ప్రయోజన సేవలు(పీఎల్‌పీయూఎస్)పై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. పీఎల్‌పీయూఎస్ ఛైర్‌పర్సన్ ఎ.గాయిత్రిదేవి మాట్లాడుతూ విద్యుత్ సరఫరా, తాగునీరు. పారిశుధ్యం, వైద్య, తపాలా, టెలీఫోను, బ్యాంకింగ్ వంటి సేవలకు సంబంధించిన సమస్యలను పీఎల్‌పీయూఎస్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ తరహా వివాదాల్లో కోర్టు ఫీజు లేకుండా రాజీ మార్గం ద్వారా సత్వర పరిష్కారం పొందవచ్చన్నారు. డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, ఇందులో కోర్టులో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, యాక్సిడెంట్ కేసులు, బ్యాంకు కేసులు రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు, ప్రీలిటిగేషన్ కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతు అభ్యున్నతే లక్ష్యం

- ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ
- పలుచోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

దివాన్‌చెరువు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతు అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం పాటుపడుతోందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. మండలంలోని సంపత్‌నగరం, కొండగుంటూరు, జి.ఎర్రంపాలెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల కోసం గిట్టుబాటు ధరలు కల్పించామని, పండించిన ప్రతీ గింజ కొనుగోలు చేస్తామన్నారు. అవసరం మేరకు ఖాళీ గోనె సంచులు అందిస్తామన్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయడంతో బాటు రైతుల నుంచి ధాన్యం కొన్న 48 గంటల్లో వారి ఖాతాల్లో సొమ్ము జమ చేస్తామని చెప్పారు. గతంలో ధాన్యం అమ్ముకునేందుకు ఎక్కడో దూరంగా ఉన్న రైసుమిల్లులకు రైతులు వెళ్లవలసి వచ్చేదని, కానీ నేడు రైతులు తమకు దగ్గరలో ఉన్న రైస్‌మిల్లుల్లో ధాన్యం విక్రయించుకునే వెసులుబాటు కల్పించామని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసరెడ్డి, తహశీల్దార్ లక్ష్మీలావణ్య, ఏవో ఎస్‌కే ఇమామిఖాసిం, ఎంఎస్‌వో జి.బాపిరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నచ్చిన మిల్లుకు అమ్ముకోవచ్చు



సంపత్‌నగరంలో ధాన్యం తూకం వేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

బిక్కవోలు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బలభద్రపురంలో వ్యవసాయశాఖ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో జిల్లాలో రైతుల వద్ద తక్కువ ధరకు ధాన్యం కొని రూ.20 కోట్లు అవినీతికి పాల్పడ్డారని, అలాగే భూసేకరణలో కూడా అవినీతికి పాల్పడ్డారన్నారు. రైతులు తమకు నచ్చిన మిల్లుకు ధాన్యం అమ్ముకోవచ్చునని, గతంలో కంటే రూ.95 మద్దతు ధర పెంచినట్టు చెప్పారు. గత ప్రభుత్వం రైతులకు పూర్తిగా విస్మరించిందని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఐదేళ్లుగా కాలువల్లో తీయని తూడును రూ.20 కోట్ల ఖర్చుతో తీయించామన్నారు. కార్యక్రమంలో పడాల రామారెడ్డి, ఎన్‌వీ సుబ్బారెడ్డి, వీరరాఘవరెడ్డి, సర్పంచ్ బుంగా రామారావు, ఏడీఏ డీవీ కృష్ణ, ఏవో శామ్యూల్‌జాన్ పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు

కడియం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జేగురుపాడులోని రైతుభరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ప్రారంభించారు. ప్రతీ రైతుకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అలాగే మిషన్ పాతోల్ ఫ్రీ ఏపీ కార్యక్రమంలో భాగంగా కడియపుసావరంలో గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మండలంలో రూ.88 లక్షలతో రోడ్లకు మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. కార్యక్రమాల్లో వెలుగుబంటి ప్రసాద్, గారపాటి అమరనాథ్, మార్గాని సత్యనారాయణ, చెక్కపల్లి మురళి, వరగోగుల సత్యనారాయణ, పాతూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



కడియం: జేగురుపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

వైభవంగా గణపతి హోమం

రంగంపేట నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో మణికంఠ క్షేత్ర పీఠాధిపతి చొల్లంగి ఉర్జునరావు గురుస్వామి ఆధ్వర్యంలో శనివారం గణపతి హోమం నిర్వహించారు. అలాగే స్థానిక మంచినీటి చెరువు నుంచి 108మంది కన్యలు కలశాలతో గ్రామోత్సవం నిర్వహిస్తూ జాలాలను తెచ్చి శివయ్యను అభిషేకించారు.

లక్ష్మీనరసింహుడి కొండకు
కార్తీక దీపోత్సవం

కోరుకొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కోరుకొండ ప్రముఖ శ్రీ వైష్ణవ పుణ్య క్షేత్రమైన లక్ష్మీనరసింహస్వామి వారి కొండ మెట్ల(650) కార్తీక మాసం నెల రోజులు దీపోత్సవం నిర్వహించే కార్యక్రమం శనివారం రాత్రి స్వామి కొండ దిగువన ఉన్న స్వామి వారి పాదాల వద్ద ప్రత్యేకపూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మెట్ల దీపోత్సవం, అన్నసమారాధన కార్యక్రమాలు నిమిత్తం లక్ష రూపాయలు విరాళాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కుటుంబ సభ్యులు నరసింహస్వామి సేవా కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బదిరెడ్డి దొర, తాటికొండ శ్రీను, తెలుగుదేశంపార్టీ నాయకులు కటకం చలం, నరసింహస్వామి దేవస్థానం అర్చక స్వామి నాగు ఆచార్యులు, పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

గత వైసీపీ వాసనలు వదులుకోండి

- ప్రజా సమస్యలకు జవాబుదారీతనంగా ఉండాలి
- ఇంజనీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే వాసు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 2 ,(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ వాసనలు వదులుకొని పని చేస్తే అందరికి మంచిదని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంకా వైసీపీ అధికారంలో ఉన్నదన్నట్లుగా వ్యవహరించేవారిని ఉపేక్షించబోమన్నారు. నగరంలో జరుగుతున్న పనులు, వాటి నాణ్యత విషయంలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. అలాగే ప్రస్తుత కార్తీక మాసం నేపథ్యంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. భక్తుల సదుపాయాల తదితర అంశాలపై చర్చించారు. వివిధ సమస్యలతో కార్యాలయానికి వచ్చే ప్రజలకు జవాబుదారితనంతో వ్యవహరించాలని ఎటువంటి నిర్లక్ష్యం వహించినా సహించబోమని హెచ్చరించారు. ఇదిలా ఉండగా అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.1.15 లక్షచెక్కులను ఎమ్మెల్యే వాసు అందించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, మజ్జి రాంబాబు, యెనుముల రంగబాబు, కంటిపూడి రాజేంద్రప్రసాద్, రేగేటి సూరిబాబు, చాపల చిన్నరాజు, ముద్రగడ జయరామ్, వాసిరెడ్డి బాబి పాల్గొన్నారు.

'అక్షరశ్రీ'కి అన్‌ఎయిడెడ్ జూనియర్ కళాశాల

స్థానిక తిలక్ రోడ్డులోని అక్షరశ్రీ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్‌కు అన్‌ఎయిడెడ్ జూనియర్ కళాశాలను తమ ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. అక్షరశ్రీలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారిగా రాజమహేంద్రవరంలోనే అన్‌ఎయిడెడ్ జూనియర్ కళాశాలను మంజూరు చేశారని, ఈ విద్యాసంవత్సరం నుంచి కళాశాల పనిచేసేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నాగరత్నం, అనుశ్రీ, కాశి నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాస పుణ్యస్నానాలు

పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. ఆకాశ దీపోత్సవం

ధవళేశ్వరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా శనివారం తెల్లవారుజామున భక్తులు పెద్ద సంఖ్యలో రామపాదాల స్నాన ఘాట్‌లో పుణ్యస్నానాలు ఆచరించారు. గ్రామంలోని బాలా త్రిపుర సుందరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయం, ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం, జ్ఞాన ప్రజ్ఞాదేవి సమేత విద్యేధర స్వామి ఆలయాలు ప్రత్యేకంగా ముస్తాబయ్యాయి. ఆయా ఆలయాల్లో స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. సాయంత్రం నిర్వహించిన ఆకాశ దీప మహోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కార్తీక నిత్యాన్నదానం ప్రారంభం

బాలా త్రిపుర సుందరి సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా భక్తుల సహకారంతో శనివారం నుంచి నిత్య అన్నదానాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్లు కొత్యాల సుబ్బారాయుడు, పందెళ్ళ భానుప్రసాద్, నాయకులు యర్రమోతు ధర్మరాజు, ఆళ్ల ఆనందరావు, అడపా శ్రీను, నందిగం సత్యనారాయణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ముత్యాలమ్మ కార్తీక గ్రామ పంక్తి

కార్తీక మాసం సందర్భంగా ధవళేశ్వరం గ్రామదేవత ముత్యాలమ్మ గ్రామ పంక్తిని ఆదివారం ఏర్పాటు చేశారు. గ్రామంలోని భక్తులు అందరూ ఈ కార్తీక అన్న సమారాధనలో పాల్గొని అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించాలని ఆలయ నిర్వాహకుడు మెండా సీతారామయ్య ఒక ప్రకటనలో కోరారు. రథం వీధి పొడవునా గ్రామ బంతి నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

గుంతలు రహిత రోడ్లే లక్ష్యం



సూదికొండ వద్ద కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నెహ్రూ

రంగంపేట: మండలంలోని దొంతమూరు శివారు బాలవరంలో గుంతలు పూడ్చే కార్యక్రమా నికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లు మరమ్మతులకు కూడా పనికిరాని విధంగా మారిపోయాయని, ఛిద్రమైన రోడ్లపై ప్రజలు పడుతున్న ఇబ్బందుల నుంచి విముక్తి కలిగించే దిశగా రాష్ట్ర వ్యాప్తంగా మిషన్ పాతోల్ ఫ్రీ కార్యక్రమం చేపట్టామన్నారు. జనవరి 15 నాటికి రాష్ట్రంలో ఎక్కడా రోడ్లపై గుంతలు లేకుండా చేయాలన్న సంకల్పంతో సీఎం చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు వైసీ పీ నేతలకు కనిపించక పోవడం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. కార్యక్రమంలో పీవీ రామారెడ్డి, ఆళ్ల గోవిందు, వెలుగుబంటి సత్తిబాబు, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

గోకవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గుంతలు రహిత రోడ్లే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ పాతోల్ ఫ్రీ ఏపీ(గుంతలు రహిత ఆంధ్రప్రదేశ్) కార్యక్రమాన్ని పలుచోట్ల శనివారం చేపట్టారు. దీనిలో భాగంగా గోకవరం మండలం సూదికొండ వద్ద గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నెహ్రూ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్లు బాగు కోసం రూ.826 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వచ్చే జనవరి నాటికి గుంతల రహిత రోడ్లను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రానున్న రోజుల్లో వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు ఉండబోవన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

- ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ
- పలుచోట్ల మిషన్ పాతోల్ ఫ్రీ ఏపీ కార్యక్రమాలు

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక కంబాల చెరువు వద్ద రహదారిపై పడిన గుంతలను పూడ్చే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పూడ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఐదేళ్లలో ఒక్క గుంతను వైసీపీ ప్రభుత్వం పూడ్చిన దాఖలాల్లేవన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమంతో పాటు అభివృద్ధిపైనా దృష్టిపెట్టి రహదారులు మెరుగుపరిచేవిధంగా చర్యలు చేపట్టిందన్నారు. అనుశ్రీ సత్యనారాయణ, కాశి నవీన్ కుమార్‌లతో కలిసి గుంతలను ఆయన స్వయంగా పూడ్చారు. కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



బాలవరంలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

నిందితులకు కఠినశిక్ష పడేలా చూస్తాం

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

కడియం, నవంబరు 2: హత్యాచారం ఘటనలో నిందితులు ఎంతటి వారైనా కఠిన శిక్షలు పడేలా చూస్తామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. బుర్రిలంకలోని హత్యాచారానికి గురైన మహిళ కుటుంబాన్ని శనివారం నాయకులతో కలిసి ఆయన పరామర్శించారు. అనంతరం గోరంట్ల మాట్లాడుతూ ఈ దారుణానికి పాల్పడిన మానవ మృగాలను మనుషుల్లోకి రాకుండా చేయడంతో పాటు కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి, మత్తు పదార్థాల సరఫరాపై నిఘా ఉంచాలని పోలీసులకు సూచించారు. కేసు ఏళ్ల తరబడి కాకుండా నిందితులకు వెంటనే శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. మృతురాలికి దివ్యాంగురాలైన కుమార్తె ఉందని, ఆమెకు పెన్షన్ ఇచ్చేలా పత్రాలు సిద్ధం చేయాలని, బాధిత కుటుంబానికి 2సెంట్ల స్థలం కేటాయించేందుకు స్థల సేకరణ చేయాలని తహశీల్దారు పోశిబాబు, ఎంపీడీవో రమేష్‌లకు సూచించారు. బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధి మంజూరుకు హామీ ఇచ్చారు. తక్షణ సాయంగా రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, పాటంశెట్టి రాంజీ, మార్గాని సత్యనారాయణ, గట్టి సుబ్బారావు, బోడపాటి గోపి, ముద్రగడ జమీ, గట్టి నర్సయ్య పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కరువు: వైసీపీ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మహిళలకు రక్షణ కరువైందని, హత్యలు, అత్యాచారాలు పెరిగాయని వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ విమర్శించారు. శనివారం వేణు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జక్కంపూడి విజయలక్ష్మి, పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఆకుల వీర్రాజు, గిరజాల బాబు, మేడపాటి షర్మిలారెడ్డి తదితరులు బుర్రిలంకలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ఏర్పడిన తరువాత మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని, గంజాయి, మత్తు పదార్థాల వినియోగం పెరగడమే ఇందుకు కారణమన్నారు. మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేసి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో గిరజాల బాబు, నక్కా రాజబాబు, కొత్తపల్లి మూర్తి, తాడాల చక్రవర్తి, గాద రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రరావు సంతాప సభ

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అరసం యువజన సమితి, ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ సంయుక్త నిర్వహణలో పడాల వీరభద్రరావు సంతాప సభ శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన అరసం జాతీయ ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ మాట్లాడుతూ వీరభద్రరావు తన తండ్రి రామారావు రచించిన అల్లూరి సీతారామరాజు జీవిత విశేషాలను పరిశోధించి వెలుగులోకి తెచ్చి, తండ్రి రాసిన 100 గ్రంథాలపై సాహిత్య అకాడమీ సౌజన్యంతో సెమినార్ కూడా జరిపారని అన్నారు. పలువురు వక్తలు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

రాజానగరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నిరక్షరాస్యత నిర్మూలనలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఏపీఎం గుమ్మడి సునీత పిలుపునిచ్చారు. ఉల్లాస్‌లో భాగంగా సమాజంలో అందరికీ జీవితకాల అభ్యసన, అవగాహన కార్యక్రమంలో నియమించిన వలంటీర్ టీచర్ (వీటీ)లకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యతను పెంపొందించేందుకు వాలంటీర్లు కృషి చేయాలన్నారు. 5వ తేదీ సాయంత్రం నుంచి బోధన ప్రారంభించాలని సూచించారు.

హామీలు నెరవేర్చడమే లక్ష్యం

బిక్కవోలు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలు నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. బిక్కవోలులో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన శనివారం ప్రారంభించి మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇచ్చిన హామీలన్నీ ఒకొక్కటి నెరవేరుస్తున్నామని, జనవరిలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, తల్లికి వందనం కార్యక్రమాలు చేపడతామన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై తాను చర్చకు సిద్ధంగా వున్నానని ఎమ్మెల్యే తెలిపారు.



మద్యం.. మీనమేషాలు!

- కుదుట పడని వ్యాపారం
- కొత్త షాపుల నిర్మాణంలో నిమగ్నం
- కొందరి ఇష్టానుసారం
- రూ.72 కోట్ల 29 లక్షల సరుకు షాపులకు
- 20 శాతం మార్జిన్ ఇస్తానని పది జమ
- 125 దుకాణాల్లో ఇప్పటికి
- 40కి మాత్రమే రెగ్యులర్ లైసెన్స్
- ఈనెల 7లోపు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు
- అన్నీ రెగ్యులర్ లైసెన్స్‌లు కావాలి
- డిపాజిట్ రూపంలో రూ.14 కోట్ల 35 లక్షల 85 వేల ఆదాయం
- దరఖాస్తు రూపేణా 87.68 కోట్ల ఆదాయం
- రూ.99 బాటిళ్ల సరుకు కొరత

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

మద్యం వ్యాపారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. గతనెల 16వ తేదీ నుంచి మద్యం అమ్మకాలకు అనుమతి వచ్చినప్పటికీ ఇంకా చాలామంది కుదుటపడలేదు. జిల్లాలో 125 దుకాణాలకు టెండర్లు పిలిచి లాటరీవేసి, కేటాయించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం రెండు నెలలకు మొత్తం 125 దుకాణాల నుంచి డిపాజిట్ రూపంలోరూ.14కోట్ల 35 లక్షల 85వేల ఆదాయం వచ్చింది. దరఖాస్తు రూపేణా 87కోట్ల 68 లక్షల ఆదాయం వచ్చిన సంగతి తెలిసిందే. ఇక గత నెల 16వ తేదీ నుంచి ఇప్పటివరకూ రాజమహేంద్రవరం మద్యం డిపో నుంచి రూ.72 కోట్ల 29 లక్షల విలువైన సరుకు దుకాణాలకు చేరింది. అందులో కొంత దుకాణాలలో ఉండగా, మిగతాది అమ్ముడైంది. సుమారు రోజుకు జిల్లాలో రూ.3 కోట్ల సరుకు తాగేసినట్టు లెక్క. కానీ ప్రభుత్వం తక్కువ ధరకే నాణ్యమైన సరుకు విక్రయిస్తానని చెప్పి రూ.99కే క్వార్టర్ ఇస్తున్న సంగతి తెలిసిందే. కానీ దీనికి డిమాండ్ బాగా పెరిగింది. సరుకు మాత్రం కొంతే రావడం గమనార్హం. అన్నీ దుకాణాల నుంచి ఇండెంట్లు పెట్టినా, డిపో నుంచి సరుకు ఇవ్వలేకపోతున్నారు. ఇక పోటాపోటీగా దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు సిండికేట్ కావడానికి చేసిన ప్రయత్నాలు కూడా ఇంకా పూర్తిగా కొలిక్కి రాలేదు. వాస్తవానికి చాలామంది దుకాణాలు నిర్మించుకునే పనిలో ఉన్నారు. తాత్కాలికంగా షాపులు నిర్వహిస్తున్నారు. కొందరు పెద్దరూమ్‌లు పెట్టుకుని, అక్కడే తాగేసేటట్టు చేయడంతో, కొందరు వ్యాపారులకు నష్టం జరుగుతోంది. కొందరికి బాగా అమ్ముడవుతుంటే కొందరు షాపుల వద్ద పెద్దగా మద్యం ప్రియులు కనిపించడంలేదు. అనుమతి లేకుండా పర్మిట్లు రూమ్‌లా ఏర్పాటుచేయడంతో అక్కడ ప్రజలు కూడా ఇబ్బంది పడుతున్నారు. కొందరు బెల్ట్ షాపులు కూడా పెట్టే ప్రయత్నం చేస్తున్నారు.

● మార్జిన్ ఆందోళన

లిక్కరు వ్యాపారులు ఒకపక్క వ్యాపార ఏర్పాట్లలో నిమగ్నమవ్వడంతోపాటు మరోపక్క ఎక్సైజ్‌శాఖ వ్యాపారులకు 20శాతం మార్జిన్ ఇస్తానని చెప్పి ప్రస్తుతం పది శాతమే జమచేయడంతో అందరూ ఆందోళన చెందుతున్నారు. పోటాపోటీగా దుకాణాలు దక్కించు రూ.లక్షలు పెట్టినా, మార్జిన్ సరిగ్గా ఇవ్వకపోవడంతో తమ పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాణసంచా క్షతగాత్రుల్లో మరొకరి మృతి - 6లో

నేటి నుంచి స్కవర్ స్లూయిజ్ ఆపరేషన్

ధవళేశ్వరం, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): ఆదివారం పశ్చిమడెల్టాలో, 4న మధ్య డెల్టాలో, 5న తూర్పుడెల్టాలో వరదల వల్ల డెల్టా అప్రోచ్ కెనాల్స్‌లో పేరిగిపోయిన బురద, ఇతర వ్యర్థాలను తొలగించి పంట సాగునీరు సక్రమంగా పారేందుకు మూడు డెల్టా కాలువల పరిధిలో స్కవర్ స్లూయిజ్‌ల ద్వారా ఫ్లషింగ్ ఆపరేషన్‌ను నిర్వహించనున్నట్టు హెడ్‌వర్క్స్ ఈఈ ఆర్.కాశీ విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం పశ్చిమడెల్టాలో, సోమవారం మధ్యడెల్టాలో, మంగళవారం తూర్పుడెల్టా స్కవర్ స్లూయిజ్ వద్ద ఈ ప్రక్రియను చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు.

కార్తీక సందడి మొదలైంది..





రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌లో శనివారం తెల్లవారు జామున కార్తీక స్నానాలు ఆచరించి పూజలు చేస్తున్న మహిళలు

కార్తీక సందడి మొదలైంది. రాజమహేంద్రవరం, కొవ్వూరులలోని గోదావరి ఘాట్లలో వేలాది మంది పుణ్యస్నానాలు చేసి పూజలు చేశారు. శనివారం వేకువజామునే భక్తుల రద్దీ కనిపించింది. తర్వాత నదిలోకి దీపాలు వదిలారు. శైవ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

అంతా తామై..



- ఇంటి మేనేజర్లు.. బాధ్యతల ఇంజనీర్లు
- వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలు
- వృత్తి.. కుటుంబం.. రెండు కళ్లుగా పయనం
- నేడు ప్రపంచ గృహిణుల దినోత్సవం

చదువులో ఎంత రాణించినా.. ఏ హోదాకు ఎదిగినా.. ఉన్నత స్థానాన్ని అందుకొన్నా.. ఒక మహిళకు గృహిణిగా ఉన్న బాధ్యత ముందు అవన్నీ చిన్నవే. భర్త అవసరాలను తీర్చి.. పిల్లల అలనాపాలనా చూస్తూ.. పెద్దలను సముదాయిస్తూ.. ఇంటిని చక్కబెట్టుకుంటూ.. ముందుకు సాగాలి. ఇంట్లో వాళ్లకు ఏ సమయానికి ఏమి కావాలో చూసుకోవడమే ప్రధాన విధిగా రోజులు గడుపుతుంది. ఆమె చేసే ఇంటి పనులను ఆర్థికంగా లెక్కగడితే పురుషుల సంపాదన దిగదుడుపే. అందుకే ఇంటికి వెలుగు ఇల్లాలు అనే నానుడి అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ బాధ్యతల బరువును మోస్తూనే ఉంటుంది. ఇక వివిధ పదవుల్లో, ఉద్యోగాల్లో ఉన్న గృహిణులైతే అటు ఆ బాధ్యతలు ఇటు ఇల్లు చక్కబెట్టుకోవడంతోనే జీవితం సాగిపోతుంది. ఈ క్రమంలో తమ సంతోషాలనూ త్యాగం చేస్తారు. ప్రపంచ గృహిణుల దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి





కుటుంబ సభ్యులతో దీపావళి వేడుకలు చేసుకుంటున్న జిల్లా కలెక్టర్

చిన్న చిన్న సంతోషాలకు దూరమవుతాం..

2007లో పార్వతీపురం ఆర్డీవోగా విధుల్లో చేరాను. 2008లో పెళ్లయింది. ప్రస్తుతం పాప సెవన్త్, బాబు పదో తరగతి. మాకు పరిచయం అయిన తర్వాత పెద్దల అంగీకారంతో వివాహం జరిగింది. అప్పటి నుంచీ గృహిణిగా బాధ్యతలు వచ్చాయి. నాన్న, అమ్మ, అత్తమ్మ ముగ్గురూ మాతోనే ఉంటారు. మామయ్య లేరు. గృహిణిగా నా బాధ్యతల్లో కొన్ని వాళ్లు తీసుకున్నారు. పిల్లల బాధ్యత పూర్తిగా నేను తీసుకుంటాను. ఆఫీస్ పని అయిపోయాక వాళ్లతో గడపడానికి ప్రయత్నిస్తాను. నేను ఇంటికి వెళ్లేప్పటికి రాత్రి 9గంటలు అవుతుంది. చిన్నప్పుడు నా సమయం సర్దుబాటు చేసుకొని వాళ్లకు నేనే వండి పెట్టడం జరిగేది. లంచ్ సమయంలో కాస్త సమయం కుదిరేది కాదు. రాత్రి నేను వెళ్లే వరకూ ఇద్దరు పిల్లలూ వేచి చూస్తుంటారు. ఆలస్యం అయినా అలాగే ఉంటారు. నాకు బాగా ఆలస్యమైతే అన్నం తినేసినా నాకోసం అర్ధరాత్రి వరకూ ఎదురుచూస్తూనే ఉంటారు. మా హస్బెండ్ ఢిల్లీరావు డైరెక్టర్ ఆఫ్ ఏపీ అగ్రికల్చర్. విజయవాడలో ఇప్పుడు బాబు ఆయన దగ్గర ఉంటున్నారు. పాప నా దగ్గర ఉంటోంది. ఏదేమైనా పిల్లలతో గడపాల్సిన చాలా సమయం మిస్ అవుతున్నాం. చిన్న చిన్న సంతోషాలను అందించలేకపోతున్నాం. సాయంత్రం స్కూల్ నుంచి వచ్చినప్పుడు ఎదురెళ్లి దగ్గరకు తీసుకోలేకపోతున్నాం. వాళ్లు ఆ సమయంలో ఏమైనా మాకు చెప్పాలని ఆతృతతో వచ్చినా మేం ఇంటికెళ్లే వరకూ ఎదురుచూడక తప్పదు. పుట్టినరోజులు మిస్ అవుతాం. మొన్న సెప్టెంబరు 1న బాబు పుట్టినరోజు. ఇక్కడ ఉధృతంగా వరదల వల్ల బిజీగా ఉన్నాను. నాకు సమయం లేకపోవడంతో నా ఆశీర్వాదం కోసం విజయవాడ నుంచి బాబు వచ్చాడు. ఇలాంటివి పిల్లల మనసునూ కాస్త బాధ పెడతాయి. బాధ్యతలు తీసుకొనేప్పుడే ఉద్యోగ బాధ్యతలు ఏమిటి, ఎంత సమయం ఉంటుంది? వ్యక్తిగత జీవితం ఎలా ఉంటుందీ తెలుసు. అందువల్ల వ్యక్తిగత జీవితాన్ని సర్దుబాటు చేసుకోవాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలకు అందరూ వస్తారు. నువ్వు రావడంలేదని మా పాప ప్రశ్నిస్తూనే ఉంటుంది. ఏదో సర్దిబుచ్చుతాం. మేం చాలావరకూ వెళ్లలేం. టీచర్లతో ఫోన్లోనే మాట్లాడే పరిస్థితి ఉంటుంది. పిల్లలే కాకుండా కుటుంబపరంగా జరిగే వేడుకలు తదితర కార్యక్రమాలకు కూడా హాజరుకాలేం. సమయం దొరికినప్పుడు నేనే వండి పెడతాను. నేను ఇంట్లో ఉండే వండి పెట్టాలని పాప డిమాండ్ చేస్తుంది కూడా. పిల్లల విషయంలో చిన్న చిన్న సున్నితమైన అను భవాలు కోల్పోతూ ఉంటాం. ఇంట్లోనే ఉంటున్నాం.. ఏమీ చేయలేకపోతున్నాం.. అని కొందరు గృహిణులు బాధపడుతూ ఉంటారు. కానీ వాళ్ల కంట్రిబ్యూషన్ వాళ్లకు తెలియడం లేదు. ఎంత చదువుకున్నా.. ఎన్ని సర్టిఫికెట్లు ఉన్నా.. ప్రధానంగా విలువలు అనేవి ఇంట్లో నుంచే అలవడతాయి. ఓ ఇంజనీరును, డాక్టరును, కలెక్టర్‌ని తయారుచెయ్యగలం కానీ నైతిక విలువలు, బాధ్యతలు అనేవి కుటుంబ వ్యవస్థ నుంచే, అదీ అమ్మ నుంచే 90 శాతం వస్తాయి. ఎవరైతే పిల్లలతో ఎక్కువ సమయం గడుపుతారో పిల్లలకు విలువలు అందించడంలో విజయం సాధిస్తారు. చట్టంకంటే ఇంట్లోనే మంచి చెడులను చెప్పగలిగితే చాలావరకూ సమస్యలు ఉండవు. అందువల్ల పిల్లల క్యారెక్టర్ బిల్డింగ్‌లో గృహిణులు పూర్తి న్యాయం చేయగలుగుతారు. ఒకటి జిల్లా, రెండు సొంత కుటుంబం. రెండు కుటుంబాలనూ బ్యాలెన్స్ చేసుకోవాల్సిన బాధ్యత కూడా మాపైనే ఉంటుంది. గృహిణులకు ప్రపంచ గృహిణుల దినోత్సవ శుభాకాంక్షలు. - ఆంధ్రజ్యోతి/రాజమహేంద్రవరం



అంగన్‌వాడీలో టీచర్‌గా.. ఎమ్మెల్యేగా శిరీషదేవి

గృహిణి నుంచి అంగన్వాడీ టీచర్.. ఇప్పుడు అసెంబ్లీలో..

ఆమె ఓ సాధారణ గృహిణి.. అంగన్వాడీ టీచర్.. రెండింటి మధ్యా సమన్వయం చేసుకుంటూ సాగే జీవితం. ఇప్పుడు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి. రాజవొమ్మంగి మండలం గింజర్తి శిరీషదేవి సొంతూరు. సాధారణ గిరిజన కుటుంబం. శిరీషదేవి మూడో ఏటనే ఆమె తండ్రి మరణం. కుటుంబ బాధ్యతలు ఆమె తల్లివే. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు శిరీషదేవి చదువు తన సొంతూరులోనే. ఆరు నుంచి పదో తరగతి వరకు సింగంపల్లి. ఇంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల రాజవొమ్మంగి. డిగ్రీ (బి.ఏ) సెయింట్ పాల్ కళాశాల రాజమహేంద్రవరం. బీఈడీ ఆదిత్య కళాశాల కాకినాడ. ఆ సమయంలోనే శిరీషదేవికి 2015లో మఠం భాస్కర్‌తో వివాహం. వీరిది ప్రేమవివాహం. అత్తగారిది అనంతగిరి. శిరీషదేవి గృహిణిగా జీవితం మొదలైంది. తర్వాత అనంతగిరి అంగన్వాడీ టీచరు చిరుద్యోగం పొందారు. చిన్నారులను లాలించడం, ఆడించడం విద్యాబుద్ధులు నేర్పించడంలో శిరీషదేవి బిజీ అయ్యారు. కాలం గిరా గిరా తిరిగింది. ఎవరి జీవితం ఎపుడు మలుపు తిరుగుతుందో తెలియదు కదా. రాష్ట్రమంతా ఎన్నికల వేడి. నారా లోకేశ్ యువగళంలో నిమగ్నమయ్యారు. తన భర్త టీడీపీ నేత కావడంతో ఇద్దరూ కలసి లోకేశ్‌ని కలిశారు. రాజకీయాలపై ఉన్న ఆసక్తిని శిరీషదేవి వ్యక్తపర్చింది. ఎందుకమ్మా అని లోకేశ్ అడగడం, అంగన్వాడీల సమస్యల పరిష్కారానికని శిరీషదేవి చెప్పడం.. అది విన్న లోకేశ్ ఓ నవ్వు నవ్వి ఊరుకోవడం. సీన్ కట్ చేస్తే.. శిరీషదేవికే పార్టీ టికెట్.. ఎన్నికల ప్రచారం, హామీలు.. అఖండ విజయం.. ఇప్పుడు శిరీషదేవి ఎమ్మెల్యే. మొన్నటికి మొన్న అసెంబ్లీ సమావేశ సమయంలో తన నియోజకవర్గపు సమస్యలు, విలీన మండలాల కష్టాలు, జీవో మూడు ఆవశ్యకతపై గళమెత్తిన తీరు శిరీషదేవికి ప్రత్యేకతను చాటాయి. ఎమ్మెల్యేగా తన తొలి వేతనంతో ప్రాథమిక ఆసుపత్రులకు ఇన్వర్టర్లు కొనివ్వడం, తనకున్న బొలేరు వాహనాన్ని అంబులెన్సుగా మలర్చి నియోజకవర్గ ప్రజలకు అంకితం చేయడం పేదలపై ఆమెకున్న మక్కువను స్పష్టం చేశాయి. ఏదేమైనప్పటికీ ఒక సాధారణ గృహిణిగా జీవితం మొదలు పెట్టి ఒక అంగన్వాడీగా జీవితం కొనసాగించిన మిరియాల శిరీషదేవి ఎమ్మెల్యేగా గెలిచి ఏజెన్సీ సమస్యలను పరిష్కరించడమే ప్రథమ కర్తవ్యమని ఆమె గట్టిగా చెబుతున్నారు.

- ఆంధ్రజ్యోతి/చింతూరు

గృహిణి నుంచి.. ఎమ్మెల్యేగా..



ఇంటి బాధ్యతలు ఆమె దినచర్య.. రాజకీయ నాయకుడైన తన భర్త యోగక్షేమాలు, పిల్లలను చదివించుకోవడం ఆమె విధి. వంటావార్పూ సరేసరి. ఆమె కుటుంబంలో ఊహించని షాక్. భర్త గుండెపోటుతో ఆకస్మిక మృతి. ఆ షాక్ నుంచి కోలుకుని తన భర్త ఆశయ సాధనకోసం గృహిణి స్థానం నుంచి నెలల వ్యవధిలో ఎమ్మెల్యే స్థానానికి ఎదిగారు ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా. ఏడాదిన్నర కిందట వరకు వరుపుల సత్యప్రభ ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల రాజాకు సతీమణి మాత్రమే. రాజకీయాలతో పనిలేదు. 2019లో టీడీపీ అభ్యర్థిగా వరుపుల రాజా పోటీచేసి ఓడిపోయారు. 2023 మార్చి 4న రాజా గుండెపోటుతో ఆకస్మికంగా మృతితో అప్పటివరకు నుంచి ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి బాధ్యతలు సత్యప్రభపైనే టీడీపీ అధిష్ఠానం బాధ్యతలు అప్పగించింది. అప్పటినుంచి విపరీతంగా శ్రమించి పార్టీ బాధ్యతలు ముందుకు నడిపించారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ప్రత్తిపాడు ఎమ్మెల్యే అయ్యారు. తన భర్త రాజా నియోజకవర్గానికి ఏం చేయాలో ఏవిధమైన అభివృద్ధి చేపట్టాలో కన్న కలలను ఆమె సాకారం చేసేందుకు వడివడిగా అడుగులు వేస్తున్నారు. కష్టాలు వచ్చినప్పుడు కుంగిపోవద్దని, ఎదురొడ్డి నిలబడి విజయాన్ని అందుకోవాలని ఆమె సూచించారు.

- ఆంధ్రజ్యోతి/ప్రత్తిపాడు

సీహెచ్ వసంతకుమారి
మహిళా సెంట్రల్ జైలు పర్యవేక్షణాధికారి



త్యాగం తప్పదు..

పెళ్లయిన పదేళ్లకే మావారు కాలం చేశారు. మాకు ఇద్దరు అమ్మాయిలు. గృహిణిని. పెళ్లయిన తర్వాత నా భర్త నేను చదువుకో డానికి చాలా ప్రోత్సాహం ఇచ్చారు. నన్ను గ్రూప్-1 అధికారిగా చూడాలని కోరిక. కానీ తీరలేదు. కానీ 2007లో మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించాను. డిప్యూటీ జైలర్ (ఎస్ఐ క్యాడర్)గా రాజమండ్రిలో విధుల్లో చేరాను. తర్వాత కడప, వరంగల్‌లో పనిచేసి రాజమండ్రి మహిళా ప్రత్యేక కారాగారం సూరింటెండెంట్‌గా వచ్చాను. కొన్ని కావాలంటే మరికొన్ని త్యాగం చేయాల్సి ఉంటుంది. నేనూ అదే చేశాను. పిల్లలకు మంచి జీవితం అందించాలనేదే ఆశయం. ఉద్యోగ బాధ్యతలకు ఇబ్బంది కలగకుండా.. పిల్లలకు వండి పెట్టుకోడానికి సమయాన్ని సర్దుబాటు చేసుకోవడం అలవాటైంది.

- ఆంధ్రజ్యోతి/రాజమహేంద్రవరం



ఇసుక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

- స్టాక్ యార్డ్ వద్ద టన్ను ఇసుక రూ.150కి తగ్గింపు
- డీసిల్టేషన్ ర్యాంపుల వద్ద రూ.229కి తగ్గింపు
- ఓపెన్ రీచ్‌ల వద్ద రూ.118కి తగ్గింపు
- రెండు మూడు రోజుల్లో ఓపెన్ రీచ్‌లన్నీ ప్రారంభం
- జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్

ఉచిత ఇసుకకు జీఎస్టీ రద్దు

రాజమహేంద్రవరం, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానాన్ని అనుసరించి ఇసుక లభ్యతను పెంచడానికి వీలుగా గత నెల 25న జారీ చేసిన జీవో నంబరు 66 ప్రకారం ఇసుకపై జీఎస్టీ తొలగించడంతోపాటు ఇసుక తవ్వకం, లోడింగ్ చార్జీలను బాగా తగ్గించినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానికంగా శనివారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్సీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనుమతి పొందిన బోట్స్‌మన్ సొసైటీలన్నీ మంగళవారం నాటికి ఇసుకతీత మొదలుపెట్టాలన్నారు. వినియోగదారులకు, ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలకు, ఇతర నిర్మాణ, అభివృద్ధి పనులకు అవసరమైన ఇసుక అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టామన్నారు. రెండు మూడు రోజులలో మొత్తం ఓపెన్ రీచ్‌లన్నీ అందుబాటులోకి రావాలన్నారు. జిల్లాలో 16 ఓపెన్‌రీచ్‌లు, 9 డిసిల్టేషన్ పాయింట్లు ఉన్నాయన్నారు. స్టాక్ పాయింట్ల వద్ద మెట్రిక్ టన్ను ఇసుక ధర రూ.270 ఉండగా, ప్రభుత్వం దానిని రూ.150కి తగ్గిందని చెప్పారు. డీ సిల్టేషన్ పాయింట్ల వద్ద టన్ను ఇసుక ధర రూ.345 ఉండగా, దానిని రూ.229కి తగ్గించామని, ఓపెన్ రీచ్‌ల వద్ద రూ. రూ.220 ధరను రూ. 118కి తగ్గించినట్టు వివరించారు. ఈ సవరించిన ధరలను అన్ని ర్యాంపుల వద్ద అందరికీ తెలిసేలా ప్రదర్శించాలన్నారు. ప్రవాహాలకు ఆనుకుని ఉన్న స్థానిక సంస్థల ప్రాంతాల్లోని ప్రజల కోసం ఇసుక వివరాలను ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించాలని వివరించారు. మైన్స్ అధికారులు రూపొందించిన దరఖాస్తు, పోర్టల్ ప్రకారం ఆయా పాయింట వద్ద వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. అక్కడ ఉచిత ట్రాన్సిట్ ఫారమ్ పొందాలని, ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ అప్లికేషన్ ద్వారా నమోదు చేసుకున్న తర్వాత ఇన్‌చార్జి నుంచి డెలివరీ తేదీ, సమయం స్లాట్ తీసుకోవచ్చని వివరించారు. ఇసుకను సొంతంగా మనుషులను పెట్టి కూడా తీసుకోవచ్చని, లేదా డీఎల్ఎస్సీ ఎంపిక చేసిన ఏజన్సీ సహాయం తీసుకోవచ్చన్నారు. ట్రాక్టర్ల ద్వారా నేరుగా ఓపెన్ రీచ్‌ల నుంచి ఇసుక తీసుకుని వెళ్లవచ్చన్నారు. మల్లేశ్వరం ఓపెన్‌రీచ్ కోనసీమ జిల్లాలో ఉన్న దృష్ట్యా, ఉత్తరప్రత్యుత్తరాలతో పరిష్కరించుకోవాలని నిర్ణయించారు. చట్టబద్ధమైన మినహాయింపులో భాగంగా ఇసుకపై సీనరేజి, తవ్వకాలు, రవాణా, లోడింగ్, పరిపాలన వ్యయంపై జీఎస్టి పూర్తిగా మినహాయించినట్టు ఆమె వివరించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. చినరాముడు, ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, ఏడీ మైన్స్ డి.ఫణిభూషణ్‌రెడ్డి, జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్, జిల్లా భూగర్భ జలాల అధికారి వై.శ్రీనివాస్, సహాయ పర్యావరణ అధికారి ఎ.రామచంద్రమూర్తి, ఇరిగేషన్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ బీవీ గిరి, ఆర్అండ్‌బీ ఈఈ ఎస్‌బీవీ రెడ్డి, మైన్స్ ఏజీ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా జీఎస్టీ తదితర వివరాలలో లోపాలు ఉన్న కారణంగా ఇటీవల టెండర్ల ద్వారా వేమగిరి- కడియపు లంక, వంగలపూడి ర్యాంపుల నిర్వాహకుడికి మైన్స్ అధికారులు నోటీసులు ఇచ్చినట్టు సమాచారం. ఇక్కడ అధికారులు నిర్ణయించిన ధరకంటే తక్కువకే ఇసుక సరఫరా చేస్తానని సదరు కాంట్రాక్టరు టెండర్లు స్పష్టంగా చేయగా, అతనికి ఈ రెండు ర్యాంపులు దక్కాయి. కానీ వివరాలు నమోదు సమయంలో తప్పుడు సమాచారం ఉన్నట్టు అనుమానం రావడంతో నోటీసులు ఇచ్చినట్టు తెలిసిందే. దీంతో ఈ ర్యాంపులు ఆ వ్యక్తికే ఇవ్వాలా, రద్దు చేయాలా నిర్ణయించాలి.

కోటిలింగాలలో డ్రెడ్జింగ్

కోటిలింగాల డిసిల్టేషన్ పాయింట్లలో బోట్స్‌మన్ సొసైటీ పేరిట అనుమతి పొందిన కొందరు డ్రెడ్జింగ్ చేయడం గమనార్హం. ప్రతీరోజూ రాత్రి సమయంలో భారీగా డ్రెడ్జింగ్ చేస్తున్నారు. వైసీపీలో ఓ పదవి అనుభవించిన వ్యక్తి, ఇవాళ కొందరిని కలుపుకుని లక్షణరేఖ దాటడం గమనార్హం. ఇక్కడ అధికారులు కూడా ఎవరూ మాట్లాడకపోవడం గమనార్హం. లారీ ఇసుకను రూ.వేలాదికి విక్రయిస్తున్నారు. గాయత్రీ ర్యాంపులలో లారీ ఇసుకకు అదనంగా రూ.4 వేలు కొన్ని ర్యాంపుల నిర్వాహకులు వసూలు చేస్తుండగా, అక్కడ పర్యవేక్షకులుగా ఉన్న రెవెన్యూ ఉద్యోగులు రూ.1500 వంతున వసూలు చేస్తున్నట్టు సమాచారం.

8న మండల సర్వసభ్య సమావేశం

గోపాలపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో 8న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ టీఎస్ఎస్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2.30కు నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ అధ్యక్షత వహిస్తారన్నారు. ఆయా శాఖాధికారులు సమగ్రమైన నివేదికలతో సమావేశానికి హాజరుకావాలన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న లారీలు స్వాధీనం



వాడపల్లి రోడ్డులో ఇసుక లారీలను తనిఖీ చేస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు లారీలను స్వాధీనం చేసుకున్నట్టు కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని సమాచారం రావడంతో శనివారం కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్ కొవ్వూరు, వాడపల్లి రోడ్డులో ఇసుక లారీలను తనిఖీ చేశారు. వాడపల్లి ర్యాంపు నుంచి విజ్జేశ్వరం వైపు వెళుతున్న మూడు ఇసుక లారీలను పట్టుకున్నారు. బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న 3 లారీలను సీజ్ చేసి వాటిని పోలీసులకు అప్పగించారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

రోడ్డు మరమ్మతులకు శ్రీకారం



రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, నవంబరు 2 (ఆంధ్ర జ్యోతి): రహదారులపై గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తం గా చేపట్టినట్టు కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం కొవ్వూరు మండలం మద్దూరు గ్రామంలో గుంతలుపడిన రహదారి మరమ్మతు పనుల ను ఎమ్మెల్యే ప్రారంభించారు. మద్దూరు వంతెన నుంచి చంద్రవరం వెళ్ళే రోడ్డు మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యేను గ్రామస్థులు కోరారు. రోడ్డు మరమ్మతులు ప్రారంభించామని, సత్వరం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్, నాయుడు వీర్రాజు, నాయకులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులకు అవగాహన



సదస్సులో పాల్గొన్న హౌసింగ్ డీఈ విక్టర్‌బాబు

పెరవలి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో అనుమతి పొంది ఇల్లు నిర్మించుకోని లబ్ధిదారులు ప్రస్తుతం ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇస్తున్నదని హౌసింగ్ డీఈ విక్టర్‌బాబు పేర్కొన్నారు. మన ఇల్లు-మన గౌరవంలో భాగంగా గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యం లో ఆయా గ్రామాల్లో అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు. శనివారం తీపర్రులో గృహ నిర్మాణ లబ్ధిదారులతో అవగాహన సమావేశం జరిపారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కోడూరి నారాయణరావు, ఎంపీటీసీ రావి వెంకటేశ్వరరావు, గ్రామస్థులు కంటిపూడి సూర్యనారాయణ, ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్, కరుటూరి శ్రీనివాసరావు, యనమని భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీలకు జట్లు ఎంపిక



రాష్ట్ర పోటీలకు ఎంపికైన టెన్నీకాయిట్ జిల్లా జట్టు

దేవరపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే టెన్నీకాయిట్ బాలబాలికల జిల్లా జట్టు ఎంపిక మండలంలోని రామన్నపాలెం జడ్పీ హైస్కూల్లో శనివారం జరిగింది. అండర్-14, 17 విభాగాలకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 9,10,11 తేదీల్లో ఏలూరు జిల్లా చింతలపూడిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ సరస్వతి తెలిపారు. ఎంపికైన జట్లను హెచ్ఎం పేరం రవీంద్రనాథ్‌అభినందించారు.

భక్తుల రద్దీకి తగినట్టు సిబ్బందిని పెంచుకోవాలి

గోదావరి రేవులను పరిశీలించిన మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్



గోదావరి రేవులను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం గోదావరి రేవులను నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ శనివారం పరిశీలించారు. కార్తీక మాసం ఆరంభం సందర్భంగా భక్తులకు అసౌకర్యం కలుగకుండా చేసిన ఏర్పాట్లను ఆయన స్వయం గా పరిశీలన చేసి పలు సూచనలు చేశారు. బురదగా ఉన్న చోట్ల ఇసుక వేయాలని, తగినన్ని డస్ట్‌బిన్నులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సోమవారం అత్యధికంగా భక్తులు వస్తారు కాబట్టి అందుకు తగ్గట్టుగా సిబ్బందిని పెంచుకుని సేవలు అందించాలని సూచించారు. ఈ పనులకు సంబంధించి ఇంజినీర్లు, ఎమినిటీస్ కార్యదర్శులు పూర్తి బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ ఐ.పాండురంగారావు, సీపీ కోటయ్య, డిప్యూటీ సిటీ ప్లానర్ సత్యనారాయణ రాజు, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఈఈలు, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

అనపర్తి తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా

డాక్టర్ రామగురెడ్డి

అనపర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అనపర్తి తాలూకా అధ్యక్షుడిగా అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ఏరియా ఆసుపత్రిలో సంఘం జిల్లా ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అనపర్తి తాలూకా నూతన కార్యవర్గాన్ని ఉద్యోగులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా రవిబాబు, కార్యదర్శిగా పిల్లి ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా జీ ఆనంద్, తిరుమలదేవి, ఆలీషాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వర్మ మాట్లాడుతూ జిల్లాలోని ఆరు తాలూకాలకు గాను ఇప్పటివరకు అనపర్తి సహా ఐదింటిలో నూతన కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. కోరుకొండ తాలూకాలో మరో కమిటీని ఏర్పాటు చేయనున్నామన్నారు. వచ్చే నెల 8న రాజమహేంద్రవరంలో జిల్లా స్థాయి సదస్సు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి విల్సన్, సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ తరుణ్ వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

నిందితులకు కఠిన శిక్ష పడేలా చూస్తాం

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

కడియం, నవంబరు 2: హత్యాచారం ఘటనలో నిందితులు ఎంతటి వారైనా కఠిన శిక్షలు పడేలా చూస్తామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. బుర్రిలంకలోని హత్యాచారానికి గురైన మహిళ కుటుంబాన్ని శనివారం నాయకులతో కలిసి ఆయన పరామర్శించారు. అనంతరం గోరంట్ల మాట్లాడుతూ ఈ దారుణానికి పాల్పడిన మానవ మృగాలను మనుషుల్లోకి రాకుండా చేయడంతో పాటు కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి, మత్తు పదార్థాల సరఫరాపై నిఘా ఉంచాలని పోలీసులకు సూచించారు. కేసు ఏళ్ల తరబడి కాకుండా నిందితులకు వెంటనే శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. మృతురాలికి దివ్యాంగురాలైన కుమార్తె ఉందని, ఆమెకు పెన్షన్ ఇచ్చేలా పత్రాలు సిద్ధం చేయాలని, బాధిత కుటుంబానికి 2సెంట్ల స్థలం కేటాయించేందుకు స్థల సేకరణ చేయాలని తహశీల్దారు పోశిబాబు, ఎంపీడీవో రమేష్‌లకు సూచించారు. బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధి మంజూరుకు హామీ ఇచ్చారు. తక్షణ సాయంగా రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, పాటంశెట్టి రాంజీ, మార్గాని సత్యనారాయణ, గట్టి సుబ్బారావు, బోడపాటి గోపి, ముద్రగడ జమీ, గట్టి నర్సయ్య పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కరువు: వైసీపీ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మహిళలకు రక్షణ కరువైందని, హత్యలు, అత్యాచారాలు పెరిగాయని వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ విమర్శించారు. శనివారం వేణు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జక్కంపూడి విజయలక్ష్మి, పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఆకుల వీర్రాజు, గిరజాల బాబు, మేడపాటి షర్మిలారెడ్డి తదితరులు బుర్రిలంకలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ఏర్పడిన తరువాత మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని, గంజాయి, మత్తు పదార్థాల వినియోగం పెరగడమే ఇందుకు కారణమన్నారు. మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేసి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో గిరజాల బాబు, నక్కా రాజబాబు, కొత్తపల్లి మూర్తి, తాడాల చక్రవర్తి, గాద రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు. పక్క చిత్రంలో గోదావరి నదిలో కార్తీకదీపాలను వదులుతున్న భక్తులు





నిడదవోలులో ఆకాశ దీపానికి పూజలు చేస్తున్న దృశ్యం. పక్క చిత్రంలో గోపాలపురం మండలం జగన్నాథపురం శివాలయంలో స్వామివారికి జరిపిన ప్రత్యేక పూజలు

నేడు గోష్పాదక్షేత్రంలో వేదసభ

కొవ్వూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గోష్పాద క్షేత్రంలో ఆదివారం వేదసభ నిర్వహిస్తున్నట్టు గోష్పాదక్షేత్ర వేదశాస్త్రాభివృద్ధి వర్ధక పరిషత్ అధ్యక్షుడు డీఆర్ఎస్ఎస్ శాస్త్రి తెలిపారు. టీటీడీ ఆర్థిక సహకారంతో కొవ్వూరు నిరంజన ధర్మజ్ఞాన కళావేదికలో నేటి మధ్యాహ్నం పరిషత్ ఆధ్వర్యంలో వేదసభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కలిగొట్ల కృష్ణారావు తెలిపారు.

శివ నామస్మరణతో మార్మోగిన గోష్పాదక్షేత్రం

- కార్తీకమాసం మొదటిరోజు నదీస్నానాలకు పోటెత్తిన భక్తులు
- ప్రత్యేక అభిషేకాలు, పూజలు • కార్తీక దీపాలతో మహిళల సందడి



నిడదవోలులో సోమేశ్వరస్వామి

కొవ్వూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రం శివ నామస్మరణతో మార్మోగింది. కార్తీకమాసం మొదటిరోజు కావడంతో పట్టణ, పరిసర ప్రాంతాల భక్తులు, మహిళలు శనివారం వేకువజాము నుంచే గోష్పాదక్షేత్రం చేరుకున్నారు. గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. ప్రధాన స్నానఘట్టంలో ఉన్న శివలింగాలకు నదీ జలాలతో అభిషేకాలు చేశారు. గోదావరిలో మహిళలు కార్తీక దీపాలను వదిలారు. క్షేత్రంలోని రావిచెట్టు, తులసికోట, సుందరేశ్వరస్వామి ఆలయంలోని ధ్వజస్తంభం, నందీశ్వరుని వద్ద కార్తీకదీపాలు వెలిగించారు. భక్తులు సుందరేశ్వరస్వామిని దర్శించుకుని పంచామృత అభిషేకాలు జరిపారు. పండితులకు దీపదానాలను చేశారు. బాలాత్రిపుర సుందరీదేవి సమేత సుందరేశ్వరస్వామిని దర్శించుకుని అభిషేకాలు చేశారు. క్షేత్రంలోని ఆలయాలతో పాటు, కొవ్వూరు పట్టణ, మండలంలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి.

రేపు గోదారమ్మకు మహా మంగళ హారతి

కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం అఖండ గోదావరికి నీరాజనం (హారతి) ఇస్తున్నట్టు టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు కొవ్వూరు ఏరియా కోఆర్డినేటర్ నృసింహాద్రి రోహిణికుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ సోమవారం సాయంత్రం 5.30 నుంచి 7.30 వరకు హారతి జరుగుతుందన్నారు. టీటీడీ నుంచి తీసుకువచ్చిన శ్రీవెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు పూజలు చేస్తారు. అనంతరం గోదావరి మాతకు వివిధ రకాల హారతులతో మహా మంగళహారతి ఇస్తామన్నారు. భక్తులు వీక్షించే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

నిడదవోలు: పట్టణంలోని బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి పంచాయన క్షేత్రం, రాజరాజేశ్వరి సమేత గోలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం కార్తీకమాసం మొదటిరోజు శివ నామస్మరణతో మారుమోగాయి. తెల్లవారుజాము నుంచే సోమేశ్వరస్వామి, గోలింగేశ్వరస్వామి ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు, పూజలు జరిపారు. సాయంకాలం ఆకాశదీపం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

గోపాలపురం: కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా ఆయా గ్రామాల్లోని శివాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ముఖ్యంగా జగన్నాథపురం, గోపాలపురం, చెరుకుమిల్లి, దొండపూడి గ్రామాల్లోని ఆలయాల వద్ద కార్తీక మాసం సందడి మొదలైంది. కార్తీకమాసానికి సంబంధించిన ఏర్పాట్లలో ఆలయ కమిటీ సభ్యులు నిమగ్నమయ్యారు.

నిరక్షరాస్యులకు ప్రత్యేక శిక్షణ



చాగల్లు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిరక్షరాస్యులను గుర్తించి వారికి శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్ర మం ప్రారంభించిందని ఎంపీడీవో ఆర్.శ్రీదేవి తెలిపారు. ఇందుకోసం ఎంపిక చేసిన వలంటీర్లకు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ జరిపారు. మండలంలో 880 మంది నిరక్షరాస్యులను గుర్తించామని వారికి శిక్షణ ఇచ్చేందుకు 88 మంది వలంటీర్లను ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో యు.గురునాధం, ఏపీఎం శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

రాజానగరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యత నిర్మూలనలో ప్రజలంతా భాగ స్వాములు కావాలని ఏపీఎం గుమ్మడి సునీత పిలుపునిచ్చారు. ఉల్లాస్‌లో భాగంగా సమాజం లో అందరికీ జీవితకాల అభ్యసన, అవగాహన కార్యక్రమంలో నియమించిన వలంటీర్ టీచర్ (వీటీ)లకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ గ్రా మీణ ప్రాంతాల్లో అక్షరాస్యతను పెంపొందించేందుకు వాలంటీర్లు కృషి చేయాలన్నారు. 5వ తేదీ సాయంత్రం నుంచి బోధన ప్రారంభించాలని సూచించారు.

సీనియర్ పాత్రికేయుడు లాజరస్ మృతి



తాళ్లపూడి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీనియర్ పాత్రికేయుడు సొంగా లాజరస్ శనివారం ఉదయం మృతిచెందారు. ఆయనకు గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు తీసివేయడంతో ఇంటికే పరిమితమయ్యారు. ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, సంధ్యాజ్యోతి తదితర పత్రికల్లో రెండు దశాబ్దాల పాటు పనిచేసి ఎల్ఐసీ ఏజెంటుగా కూడా పనిచేశారు. ఆయన మృతికి తాళ్లపూడి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు జొన్నకూటి ప్రమోద్‌కుమార్, పాత్రికేయులు అప్పన రాజా, శ్రీనివాస్, గోపాలకృష్ణ నివాళులర్పించారు.

వీరభద్రరావు సంతాప సభ

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అరసం యువజన సమితి, ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ సంయుక్త నిర్వహణలో పడాల వీరభద్రరావు సంతాప సభ శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన అరసం జాతీయ ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ మాట్లాడుతూ వీరభద్రరావు తన తండ్రి రామారావు రచించిన అల్లూరి సీతారామ రాజు జీవిత విశేషాలను పరిశోధించి వెలుగులోకి తెచ్చి, తండ్రి రాసిన 100 గ్రంథాలపై సాహిత్య అకాడమీ సౌజన్యంతో సెమినార్ కూడా జరిపారని అన్నారు. పలువురు వక్తలు పాల్గొన్నారు.

జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక





రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన కొవ్వూరులోని ధర్మవరం విద్యార్థిని. పక్క చిత్రంలో పెరవలిలో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

పెరవలి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల తేతలిలో జరిగిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో 17 సంవత్సరాల విభాగంలో కానూరు హైస్కూలుకు చెందిన పదో తరగతి విద్యార్థి ఆర్.ఆనంద్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం సీహెచ్ రామాంజనేయులు తెలిపారు. ఈ విద్యార్థి ఈ నెలలో గుంటూరులో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థికి శిక్షణ ఇచ్చిన పీడీ ఎం.సుధాకర్‌రావు, పీఈటీ ఎం.వెంకట రామన్నలను ఆయన అభినందించారు. సర్పంచ్ భావన మధు, స్కూలు కమిటీ చైర్మన్ నెల్లిమి శ్యామ్ సుందర్ తదితరులు విద్యార్థిని అభినందించారు.

వాలీబాల్ పోటీలకు ఎంపిక

కొవ్వూరు: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ధర్మవరం విద్యార్థి ఎంపికైనట్టు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కొయ్యల ప్రసాద్ తెలిపారు. ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి క్రీడాకారుల ఎంపికలలో కొవ్వూరు మండలం ధర్మవరం జడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి విద్యార్థి కడియం మహాలక్ష్మి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14 రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టు తరఫున ఎంపికయ్యిందన్నారు. ఎంపికైన క్రీడాకారులకు అవంతీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 4వ తేదీ నుంచి 8 వరకు శిక్షణ అందిస్తామన్నారు. క్రీడాకారులు 9వ తేదీ నుంచి 11 వరకు విజయనగరం జిల్లా బోగాపురంలో జరిగే రాష్ట్రస్థాయి చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన మహాలక్ష్మిని పీడీఆర్ సురేష్, స్టాఫ్ సెక్రటరి కె.ఏడుకొండలు, డి.కళ్యాణి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



దేవరపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

దేవరపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాలంలో జరుగుతున్న ప్రమాదాలు రోడ్డుభద్రతా నియమాలు పాటించకపోవడం వల్లనే జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ కిషోర్ అన్నారు. దేవరపల్లిలో శనివారం శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు రోడ్డుభద్రత పాటించాలంటూ ర్యాలీ నిర్వహించి అనంతరం స్థానిక బస్టాండ్ వద్ద మానవహారం చేపట్టారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతిఒక్కరు హెల్మెట్ ధరించాలని, రోడ్డుభద్రత నిబంధనలు పాటించాలని అన్నారు. ఈ సందర్భంగా మోటార్‌సైకిల్‌పై హెల్మెట్ ధరించని వాహనదారులకు గులాబీలు ఇచ్చి నిరసన తెలిపారు. ప్రతిఒక్కరు హెల్మెట్ ధరించాలని విద్యార్థులు వాహనాదారులను కోరారు. కార్యక్రమంలో పాఠశాల జోనల్ ఇన్‌చార్జి శమ్మి, కవిత, పార్థసారధి పాల్గొన్నారు.

మహిళ భద్రతపై శ్రద్ధ వహించాలి: డీఎస్పీ

కడియం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నర్సరీల్లో పనిచేసే మహిళల భద్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఎస్పీ భవ్యకిషోర్ తెలిపారు. సర్ ఆర్థర్‌కాటన్ నర్సరీ అసోసియేషన్ కార్యాలయం వద్ద నర్సరీ రైతులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నర్సరీల్లో ఎక్కువ శాతం మహిళలు పని చేస్తున్నారని, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మహిళల భద్రత పట్ల దృష్టి పెట్టాలన్నారు. నర్సరీల్లో పనిచేసే మగవారిపై నిఘా ఉంచాలన్నారు. ఎవరైనా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. చిన్న పిల్లలను పనుల్లో పెట్టుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో నర్సరీ సంఘం అధ్యక్షుడు మల్లు పోలరాజు, సీఐ ఎ.వెంకటేశ్వరరావు, నర్సరీసంఘం డైరెక్టర్లు పాల్గొన్నారు.

గత వైసీపీ వాసనలు వదులుకోండి

- ప్రజా సమస్యలకు జవాబుదారీతనంగా ఉండాలి
- ఇంజనీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 2 ,(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ వాసనలు వదులుకొని పని చేస్తే అందరికి మంచిదని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంకా వైసీపీ అధికారంలో ఉన్నదన్నట్లుగా వ్యవహరించేవారిని ఉపేక్షించబోమన్నారు. నగరంలో జరుగుతున్న పనులు, వాటి నాణ్యత విషయంలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. అలాగే ప్రస్తుత కార్తీక మాసం నేపథ్యంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. భక్తుల సదుపాయాల తదితర అంశాలపై చర్చించారు. వివిధ సమస్యలతో కార్యాలయానికి వచ్చే ప్రజలకు జవాబుదారితనంతో వ్యవహరించాలని ఎటువంటి నిర్లక్ష్యం వహించినా సహించబోమని హెచ్చరించారు. ఇదిలా ఉండగా అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.1.15 లక్షచెక్కులను ఎమ్మెల్యే వాసు అందించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, మజ్జి రాంబాబు, యెనుముల రంగబాబు, కంటిపూడి రాజేంద్రప్రసాద్, రేగేటి సూరిబాబు, చాపల చిన్నరాజు, ముద్రగడ జయరామ్, వాసిరెడ్డి బాబి పాల్గొన్నారు.

'అక్షరశ్రీ'కి అన్‌ఎయిడెడ్ జూనియర్ కళాశాల

స్థానిక తిలక్ రోడ్డులోని అక్షరశ్రీ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్‌కు అన్‌ఎయిడెడ్ జూనియర్ కళాశాలను తమ ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. అక్షరశ్రీలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారిగా రాజమహేంద్రవరంలోనే అన్‌ఎయిడెడ్ జూనియర్ కళాశాలను మంజూరు చేశారని, ఈ విద్యాసంవత్సరం నుంచి కళాశాల పని చేసేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నాగరత్నం, అనుశ్రీ, కాశి నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు

నమోదుకు 6వ తేదీ గడువు

గోపాలపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు 6తో ముగియనున్నట్లు తహశీల్దార్ సీహెచ్. విద్యాపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బూత్‌లెవిల్ అధికారులతో ఆయన సమావేశం జరిపారు. అర్హులైన వారంతా ఓటు నమోదు చేసుకునేలా చూడాలని బూత్‌లెవిల్ అధికారులు, వీఆర్వోలకు ఆయన సూచించారు.

తాళ్లపూడి: ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదు 6తో ముగుస్తున్నదని తాళ్లపూడి తహశీల్దార్ బి.రవీంద్రనాథ్ తెలిపారు. దరఖాస్తుదారులు త్వరగా నమోదు చేసుకోవాలని గతంతో పోలిస్తే 50 శాతం మంది మాత్రమే నమోదు చేసుకున్నారని తెలిపారు.

చాగల్లు: ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటరుగా నమోదు చేసుకోవడానికి 6వ తేదీతో గడువు ముగుస్తున్నదని తహశీల్దార్ ఎం.మేరికమ్మ తెలిపారు. అర్హులు తమ కార్యాలయంతో పాటు, ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయాలన్నారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. డిప్లొమో చదివిన వారు కూడా అర్హులని ఒక ప్రకటనలో తెలిపారు.

దేవరపల్లి: డిగ్రీ పట్టా పొందిన ప్రతిఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి చెప్పారు. పశ్చిమగోదావరి పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి డిగ్రీ, బీటెక్, డిప్లమో పూర్తి చేసినవారు ఓటరు నమోదుకు అర్హులని, దరఖాస్తు చేసుకునే వారు ఓటరుకార్డు, ఆధార్‌కార్డు, డిగ్రీ సంబంధించిన జిరాక్సులను ఆన్‌లైన్ ద్వారా కానీ ఆఫ్‌లైన్ ద్వారా కానీ ఎంపీడీవో, ఎంఈవో, తహశీల్దార్ కార్యాలయాల్లో ఈ నెల 6వ తేదీ లోపు అందజేయాలని కోరారు.

సాగిపాటులో భారీ చోరీ

గోపాలపురం, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఉన్న అత్తాకోడళ్లపై దుండగులు దాడి చేసి బంగారంతో పాటు కొంత నగదును అపహరించుకుపోయిన సంఘటన మండలంలోని సాగిపాడులో శనివారం రాత్రి జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. దొండపూడి శివారు సాగిపాడులో బమిడిపాటి శ్రీనివాస్ ఇంట్లో లేని సమయంలో భార్య శారదతోపాటు తల్లి నిద్రిస్తుండగా పక్క గదిలో శబ్దం రావడంతో ఇద్దరూ వచ్చి చూడగా దుండుగులు వారిపై దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకుని గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకునే సరికే దుండగులు నగదు, బంగారం అపహరించుకుని పరారయ్యారు. గాయాలపాలైన అత్తాకోడళ్లను రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. కాగా అపహరణకు గురైన బంగారం, నగదు వివరాలు తెలియాల్సి ఉంది.

నిడదవోలులో అన్నసమారాధన

నిడదవోలు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం మానవత శాఖ ఆధ్వర్యంలో ముళ్ళపూడి బాపిరాజు ద్వితీయ వర్ధంతి సందర్భంగా రోగులకు వారి సహాయకులకు అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో మానవత సంస్థ మండలాధ్యక్షుడు దారపురెడ్డి సూర్యచంద్రరావు, ముళ్ళపూడి సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ స్క్రీన్1	: వేట్టయన్
వై.స్క్రీన్2	: విశ్వం
దేవిశ్రీ(గాయత్రి	: మార్టిన్
అనన్య	: దేవర
నిడదవోలు	
వీ మ్యాక్స్	: లక్కీ భాస్కర్
రాధాకృష్ణ	: వెనం
శ్రీగణపతి	: అమరన్
దేవరపల్లి	
శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	: దేవర
త్రినాథ్ సినీ మ్యాక్స్	: దేవర